ప్రబోధసుధ

శ్రీ శంకరాచార్యుల కృతికి
ఆంధ్ర పద్యానువాదము.

రచయిత
దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.



రచయిత :

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి

కాకినాడ

ఆశీస్సు

కాకినాడ శ్రీ వేణుగోపాలసంస్కృత ప్రచారసంఘ సభ్యుడైన చిరంజీవి దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి నా అంతేవాసులలో ఆత్మీయుడు. పండితుఁడుగా, కవిగా, విమర్శకుడుగా ఇతఁ డాంధ్రదేశమున ప్రసిద్ధి నార్జించు కొన్నాఁడు. ఈత డెన్నో బృహత్కావ్యముల నాంధ్రీకరించి ఆస్తికతకు, హిందూసాంప్రదాయములకు మిక్కిలి నోహ దము చేసినాడు. చేయుచున్నాఁడు.

ప్రస్తుత మీప్రబోధసుధ ఆచార్యశంకరభగవత్పా దుల "ప్రబోధసుధాకరము" అన్న కావ్యమునకు దెనుగుసేఁత. తత్త్వవిద్యయందు సామాన్యప్రజ్ఞగలవారికి గూడ నియ్యది సుబోధముగా సులభశైలిలో రచింపబడినది. ఆచార్య శంక రులు మహాభాష్యాదులు రచించి ఉద్దండపండితుల కెట్లు తోడ్పడిరో వందలకొలది లఘుకృతులు రచించి, అం దాభాష్యాదులలోని పిండితార్థమును తేటతెల్ల మొనర్చి మందమధ్యమాధికారులకుగూడ నటులేతోడ్పడిరి. శ్రీసూర్య నారాయణశాస్త్రి అట్టిలఘుకృతులను సుమారు 15 వఱకు ఆంధ్రీకరించి "శంకరవాణి" అను పేరితో పెక్కుసమావేశ ములలో వానిని పండిత, భక్త, సమక్షమున మనకు వినిపించి యున్నాడు. ఆరచనలను సంస్కృతప్రచారాభివృద్ధికై తత్సం ఘమున కుచితముగ నొసఁగుటయు, అందు కొన్నిటిని భక్తులువిని ముద్రింపించుటయు, వానిని పౌరుల కందించు టయు జరుగుచున్నది. ఇదియు ప్రచారములో నొకభాగమే.

ఈప్రబోధసుధ ఆస్థతోఁ జదివినవారికి వేదాంతశ్రద్ధ గలిగి తీఱు నని నావిశ్వాసము. ఇందు శంకరులు విషయ ముతోపాటు మధురకవితను గూడ జోడించి మందుతో అనుపానమువలె లోకుల కొసంగినారు. పెక్కుతావుల నేను మూలమును - అనువాదమును పరిశీలించితిని. నామనస్సు నకు చాలచోటుల "ఆహా" అనిపించినది. మూలలోనిభావము కేమాత్రము ముప్పుతేని ఈయనువాదసరణి పండితపామర సుబోధక మని అనవచ్చును. ప్రోత్సాహము కలిగించుచో నింకను ఇట్టి వనేక "శంకరవాణులు" తెలుగులోనికి ఇతఁ డనువదించిపెట్టగల డనుచు నమ్ముచున్నాను.

ఈప్రబోధసుధాకరము 19 శీర్షికలు కలది. ఇందు ఆత్మస్వరూపము, అనెడి శీర్షిక యిరువదవశీర్షికగా చేర్చి మొత్తము 20 భాగములుగా తెనిఁగించెను. చేర్చినభాగము గూడ శ్రీ ఆచార్యులవారిదే. కొన్నిశీర్షికలలో కొటేషన్ పెట్టినభాగములు క్రొత్తగా చేర్చినవి. అవి ప్రకరణమున కుత్తేజకములుగా నుండునని కూర్చబడినవి.

జన్మాంతరసంస్కారవాసితునకుగాని శంకరవాణిపై నభిరుచి కలుగదు. ఈచిరంజీవి యితోధికకృషిని నిస్వార్థముగ నొనరించి తనవాణిని సార్థకపఱుచుకొనవలె నని ఆశీర్వదింతును.

15-2-72 } కాకినాడ. }

ఇట్లు ఆర్ష విద్యాభూషణ,
జటావల్లభుల పురుషోత్తం, M.A.,

హృదయనివేదనము

శ్రీమతే వాసుదేవాయ నమః

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు శంకర భగవత్పాదుల ప్రబోధసుధాకరమునందలి సుధను గ్రోలి 'ఏకస్స్వాదు న భుంజీత' 'మధురపదార్థము ఒక్కడు తినరాదు' అన్నభావముతో ఆప్రబోధసుధను అందరకు పంచుటకై ఈప్రయత్నము నొనర్చిరి. ఆనుగ్రహికమున

"......సన్నీలమేఘ మిపుడు తనవచోధారల
వనయంబు తనియింప,బూని యద్భుత మహా
జ్ఞానసుధను-వర్షించుచుండె. అయి! మనశ్చా
తకమా! మొద్దునిద్దురలో మునిగిపోయితేమొ?
ఇచటికి దగ్గతే భార మేమియు లేదు. తత్సు
ధను గ్రోలి ఆత్మ తాదాత్మ్య మందు."

అని ఉపదేశించిరి. ఆత్మతాదాత్మ్యమునకు సాధనమే ఈ ప్రబోధసుధ. ఆత్మతాదాత్మ్యము నందుటకు జ్ఞానభక్తి వైరాగ్యములు మూడును కావలెను. అందు మొదటిది - వైరాగ్యము. అది లేనిచో మిగిలిన వెన్ని యున్నను ప్రయోజనము లేదు. వైరాగ్యము కల్గుటకు ఆత్మజ్ఞానవిరోధు లగు దేహవిషయ మనస్స్వరూపములను స్పష్టముగా తెలిసికొనవలెను. అందుకై యిందుముందుగా దేహనింద, విషయనింద, మనోనింద, చేయబడినది. శంకరభగవత్పాదులు ఎంతో మనోహరముగా అందిచ్చిన ఆప్రకరణములను శాస్త్రిగారు తెలుగువారి హృదయములకు హత్తుకొనునట్లుగ అనువదించిరి.

ఆవైరాగ్యము కలిగినను జ్ఞానము లేనిదే సుఖము లేదు. అందులకై తర్వాత ఆత్మసిద్ధి, మాయాసిద్ధి, మున్నగు ప్రకరణములలో తత్త్వము నుపదేశించిరి. ఆతత్త్వజ్ఞానము కల్గినను అది మూడువిధములుగ ఉండును - శాస్త్రజన్య జ్ఞానము, గురూపదేశజన్యజ్ఞానము, ఆత్మానుభూతి అని. అందు మొదటిది 'బెల్లము తియ్యగా ఉండును' అని తెలిసి కొనుటవంటిది. రెండవది, బెల్లమును దూరముగా చూచుట వంటిది. మూడవది బెల్లమును తాను రుచిచూచి మాధు ర్యము నెఱుంగుట వంటిది. అదియే ప్రధానము. ఆ అను భూతి కలుగుటకు మనసు లయ మందవలెను. అది లయమం దిననాడే అద్వైతానుభూతి పరిపూర్ణ మగును. ఇంతవరకు వైరాగ్యజ్ఞానములను ఉపదేశించి తరువాత భక్తిని ఉపదే శించినారు. చిత్తలమమునకు భక్తియే ప్రధానసాధనము.

"కృష్ణపదాంభోజభక్తిమృతే అంతరాత్మా న శుద్ధ్యతి.
వసనమివ క్షారోద్యైః భక్త్యా ప్రక్షాళ్యతే చేతః."
'చొటను బట్టపోల్కి-కృష్ణుని పదభక్తి లేక
పరిశుద్ధము నందదు చిత్త మెమ్మెయిన్.'

జ్ఞానమూర్తి యగు శంకరభగవత్పాదులవారు ఈ ప్రకరణములలో చూపినకృష్ణభక్తి అత్యాశ్చర్యకరము.

ధ్యానవిధిలోను, సగుణ నిర్గుణైక్యప్రకరణములోను, ఆనుగ్రహిక ప్రకరణములోను భగవత్పాదులవారు కృష్ణ తన్మయత్వము నందిరి. చివరకు కృష్ణపరత్వమును నిరూ

పించుచు మూర్తిత్రయాతీత మైన, నిత్యానందస్వరూప మయిన,సచ్చిన్మయ మైన,తత్త్వమే కృష్ణతత్త్వమని అనుభ వించిరి. కృష్ణలీలలలో కలుగుసందేహములను తొలగించిరి. చివరకు ఆకృష్ణభక్తి యున్నమాకు ఈలోకమేకాదు మోక్ష ముకూడ అవసరము లేదు అని వాక్రుచ్చిరి.

"అస్మాకం యదునందనాంఘ్రియుగళధ్యానావధానార్థినాం
కిం లోకేన దమేన కిం నృపతినా స్వర్గాపవర్గైశ్చ కిమ్."
'అందముగా యదూద్వహుపదాంబుజభక్తినెకోరుచుండుమా
కెందులకయ్య లోకము మహీపతులాత్రిదివాపవర్గముల్'

ఇట్లు శంకరభగవత్పాదులలోకోత్తరకృష్ణభక్తిప్రకా శకము లగు ఈభాగములందలిసారమును శ్రీ సూర్యనారా యణశాస్త్రిగారు అనుభవించి ఆ అనుభవమును లోపల ఆపుకొనలేక వాక్ప్రవాహరూపమున వెలిబుచ్చి తాము ధన్యులై ఆంధ్రసరస్వతికి ఒక నూతనాలంకారము సమకూ ర్చిరి. వారిజన్మము ధన్యము. ఆంధ్రజాతి ధన్యము.

శ్రీభగవత్పాదుల కృష్ణభక్తి అంశాంశ మైనను మన హృదయముల కంటునట్లు ఆ శ్రీకృష్ణభగవాను డనుగ్ర హించుగాక!

ఇట్లు,

కాకినాడ,
22-10-73,

శ్రీభాష్యం అప్పలాచార్యులు, M.A.,
(వ్యాకరణ శిరోమణి)

ప్రశంస

అండయి యాశ్రితావలికి ఆత్మసముండయి పండితాళికు
ద్దండపురాణధర్మపరతత్త్వము పూర్ణముగా గ్రహించి తా
గండరగండఁడై సకలకార్యధురంధరుడై మెలంగునా
చంద్రుచిదంబరున్ పరయశోవిభవున్ పరమేశు డోముతన్.

లొచ్చుగునిచ్చకంబులకు లొంగడు లేనిపొగడ్త లాడినన్
మెచ్చడు నెవ్వ డెంతటిమనీషియొ యెంతటిసారవంతుఁడో
నచ్చినగాని మాటనడు,నచ్చినయర్థికి నిండు గూర్చు,నీ
మచ్చిక లీచిదంబరునిమాన్యగుణంబులు నిబ్బరంబుగన్.

అక్షయమైనలక్ష్మి తనయందు కటాక్షము వెట్టియున్ననున్
లక్షలమించి సంపదలరాసులు గీమున గుల్కుచుండియున్
సాక్షిగ భూములున్ భవనసర్వసమృద్ధులు నిండి యుండియున్
ఈక్షితి నీచిదంబరుడు నించుక గర్వముసెంద డెప్పుడున్.

చూపులలో నుదారత, విశుద్ధిగ పల్కులలో గభీరతల్
ప్రాపగువారిపై కరుణ, ప్రాక్తనపండితమండలిం గనన్
దీపితమైత్రి, మంచిని కదించెడిశక్తియు, బంధురక్తియున్
దోప మెలంగు నెంతటివినూతను డౌనొ చిదంబరుం డిలన్.

అడిగెనా యొకప్రశ్న అది తూచి తూచి చ
    క్కగ పోళైముగను నిక్కముగ నడుగు
ఎదుటివా డేదృష్టి నిటు పల్కుచుండెనో
    యని లోతుపాతుల నరసి పలుకు

సకలవేదాంతాల సారసంగ్రహము పు
క్కిటఁ బెట్టుకొని వాదపటిమ నెఱపు
కర్కశతర్కవాగ్గరిమ చూపిననేని
అతిమృదుత్వము వీడ కాడుచుండు

అయినచోటను చేప లేనట్టిచోట
లక్ష్మి విరజిమ్మ డబ్బి నిర్లక్ష్యముగను
వేత్తయై నిరాడంబరవేషు డగుచు
ఇలను చంద్రుచిదంబరం బెలమి మిగులు.

పాత్రతాపాత్రతన్ బట్టి దానముసేత
లక్ష్మి యీతనియింట లలి మెలంగు
అవసరానవసరా లరసి దానముసేత
పద్మ యీతనిని జేపట్టి మెలగు
ఆస్తికగుణగణ్యుడై వసించుకతాన
సిరిసంపద లితనిఁ జేరి యుండు
మనసు నచ్చినగాని మాటీనివాడౌట
కమల యీతనియిల్లు కాఁచి యుండు

పెట్టిపుట్టినవాఁడౌట పెద్దసిరుల
పేరు గ్రామోసె, నీజన్మనఁ బెట్టుచుంట
భావిజనిగూడ సర్వసంపత్సమృద్ధి
వరలు చంద్రుచిదంబరవరుడు భువిని.

నిత్య మాహారనియమన నిరతికతన
సాత్వికాహార సేవానుషక్తికతన
చిత్తశుద్ధి ధీధ్రువత నార్జించె నితడు
ఇంతకన్న సాధకుని కింకేమి వలయు ?

విత్తము వాణియున్ పరవివేకము నమ్రత యిన్నియుం ద్వదా
యత్తము లౌట చిత్రముగదా? యొకడున్న నొకండు నిల్వ; దీ
పాత్తు త్వదీయపూర్వజనిపుణ్యవశ; మ్మటుపైని నీవు స
ద్వోత్తమశాంకరీయకృతి నొందుట జన్మ తరించుటేగతా!

శంకరసంయమీంద్రుని విశాలసుబోధము లాంధ్రమందునన్
సంకలనం బొనర్చితి వినం దగు నన్న,రహిన్వహించి యా
తంకము వెట్టకే విని నిదానముగా,కృతిగోరి దీని ని
శ్శంకముగా సుముద్రణము సాగఁగఁజేయఁగడంగె నీతఁడున్.

పావన మైనసీధనము బ్రహ్మకృతిగ్రహణప్రసక్తి సం
భావిత మైన కారణత పావన మయ్యెను నేడ్తరంబు లో
శ్రీవిభవా! సరస్వతి వసించి భవత్కులపుత్త్రిపౌత్రిలన్
దేవి యనుగ్రహించి కరుణించుత మాస్తికపండితాళిగన్.

"సప్తసంతానములలో బ్రశస్తి గాంచి
ఖిలము గాకుండునది యొక్క కృతియచూవె"
ఇట్టిసత్కృతి నీవు గ్రహించుకతన
ధరను నిత్యుఁడ వోచిందబరమనీషి.

శ్రీ శ్రీ చుండ్రు చిదంబరంగారు, వేళంగి.

ప్రబోధసుధ

దేహనింద

—/—

పుట్టుక లేనివాఁడవయి పూర్ణత నుత్తమపూరుషుండవై
నెట్టన సర్వదేహముల నీవె వసించుచు నంతరాత్మవై
నట్టె,సదాత్మకుండవుఁ జిదాత్మకుఁడై జగదీశ్వరుండవై
మెట్టిన యోయదూద్వహా!అమేయగుణాకర!మన్నమస్కృతుల్

కడక నవరసభరితంబుగా జగంబు
లీవు సృజియించి రసములనెల్ల నామ
హారసం బగునానందమందు ముంచి
యెసఁగు దీవు నిత్యానందరసమయుఁడుగ.

దివ్వెల కగ్గికి వేల్పుం
బువ్వగు ఱేరాజునకును బూపకు నీవే
మవ్వపుఁదేజ మొసంగుటఁ
జువ్వె స్వయంజ్యోతి వైతిసూ యదునాథా!

నిను వర్ణింప నపౌరుషేయపునుడుల్ నేరంగలే వన్నచో
వినుతింప న్నరు లెంతవార లయినన్ వేదాంతశాస్త్రార్థసం
మననం బర్చ లుపాసనల్ సలిపి పల్మార్ చింతనల్ కీర్తనల్
వినుతుల్ సేయ; విరక్తి లేక కనఁగా లేమయ్య మోక్షార్హతన్.

ముక్తికి సాధనంబులు మూఁడు, వైరాగ్య
మాత్మబోధము భక్తి యనఁగ నొప్పు
ఆశ లేకుండుటయె యగును వైరాగ్య, మ
య్యది సర్వదేహంబులందుఁ దగిలి
అలయహంతామమతలచేఁ బిధానమై
నివురు గప్పిననిప్పువవిధి నుండుఁ
దనుధారు లియ్యహంతను దేహములపైని
భార్యాదివిషయాలిపై మమతను

చూపుచుండు, రీరీతిని జోద్యముగను
అఖిలదేహములందు రహస్యముగను
డాగియున్నయీరెంటి నడంచుమార్గ
మెటులో వినుఁడయ్య నే వచియింతు నిపుడె.

ఏమిటం బుట్టె నీతను, విట్టిదాని
స్వస్వరూపం బదేమి? విషయములకును
దాని కేమిసంబంధబంధంబు కలదో
యనువిమర్శముచే నవి యణఁగిమణఁగు.

ఆలు మగండు గూడ వలపై, కలుపై పడుశుక్రశోణితా
లోలిని బిందురూపముగ నుండఁగ నందు స్వకర్మబద్ధుఁడై
వ్రేలెడిజీవి నెమ్మదిఁ బ్రవేశ మొనర్చుచుఁ, బిండరూపమై
పోలికలంటి దేహమును బొందును దొమ్మిదిమాసముల్ సనన్.

శ్లేష్మమూత్రపురీషసంశ్లిష్ట మైన
జననికడు పనుములికిగుంటను వసించి
తల్లిజఠరాగ్నిచేఁ దాను దగ్ధ మగుచు
గర్భనరకము నందు నాకర్మజీవి.

పురు డదిచల్లఁగా నడచిపోయినదా సరి, లేక యడ్డమై
తిరిగి నిసుంగు వెల్వడక దెప్పరమైనను, గత్తికోఁతలన్
దఱుగుచు నూడలాగెదరు; తప్పిన నద్ది ప్రసూతివాతముల్
ఇరుకుననుండి నెట్ట నరరే యపు డెంతటిబాధ సెందునో?

గండము లిన్ని దాఁటి కడకన్ వెలువడ్డనిసుంగు కవ్వలన్
నిండుసుఖమ్ము లున్నె? గమనింపఁగరానిమహావిపత్తులున్
దండుగలున్ వియోగములుదారుణరోగములున్ దరిద్రతల్
మెండుగఁ దాఁకఁగాఁ బడునమేయమనోవ్యథ లెన్నశక్యమే?

పుట్టుచు గిట్టు చెట్టెటులో పుర్వుగఁ బక్షిగను న్మకంబుగాఁ
బుట్టఁగరానియోనులనుబూర్వపుఁగర్మముచేభ్రమించుచున్
గట్టిగ యాతనల్ గుడిచి కట్టకడ న్నరుఁడై ద్విజుండునై
పుట్టిశ్రుతిప్రచారమును బూజ్యకులాచరణ మ్మొనర్చుచున్.

బెట్టుగ దేహదేహిసువివేకము లేక, నశించిపోవు నీ
మట్టిశరీరమం చెఱుకమాలుచు జీవితమెల్ల వ్యర్థమౌ
నట్టులు ప్రాజ్ఞులే గడప నక్కట! ఆయువు కోటిటంకముల్
పెట్టి కొనన్ లభింప దవివేకము దీనిని మించి యున్నదే?

మానవతనువున్ వీడుచుఁ
దాను బశువుగా జనింపఁ దన దేహంబే
కానఁగ రాఁ డపు డయ్యో!
మానితపరమార్థవిషయమై యేమందున్ ?

గజవృషభాశ్వముల్మహిషగర్దభము ల్తగ మోఁతమోయుచు
న్గజగజలాడుచున్ క్షుధకుఁ, గాయములెల్లను బక్కచిక్కఁగా
నిజమున కవ్వి చెందు శ్రమ నిత్య మవే వచియింపలేనివై
బుజములఁ బుండ్లుపుట్టఁ గడుమూల్గుచు నిల్వవె కట్టుఁగట్టలన్.

నెత్తురు మాంసమజ్జలును నీరముఁ గ్రొవ్వును శుక్ల మెమ్ములున్
బిత్తము శ్లేష్మవాతములుఁ బేర్కొన నైనది దేహ మందు జా
గ్రత్తుగఁ గప్పి పెట్టినచొఁ గారపుఁజర్మము లేకయున్నను
వ్వెత్తుగ ద్రోణకాకములు వేడుక భక్షణచేయకుండునే ?

ముక్కుననోటఁ గారు కఫమున్ మలమూత్రములం గనుంగొన
న్మిక్కిలిగా నసహ్యపడునే నరుఁ, డయ్యవి స్వీయదేహమం
దెక్కడఁ జూడుమున్నవని యేల గ్రహింపఁడొ? బాటనెమ్మికన్
ద్రొక్కఁగనుల్లువాఁడు తనదుమ్ములు లోనివెఱుంగఁడే మొకో?

"జుట్టుమొదలు కాలిజుట్టనవఱకును
బూతిగంధయుక్తిఁ బొదలుచున్న
చవుటిదేహమునకుఁ జందనాగరువులఁ
బూసి కంపుఁ గప్పఁ బూను టేల ?"

సాక! స్వాభావికపుదోషసమితి నిట్లు
గొప్పజతనాలచేఁ గప్పికొనుచు నుండి
పైగఁ దెచ్చినగొనముల భ్రాంతి గొలిపి
మూఢుఁ డీదేహమును దెగఁబొగడుచుండు.

కర్మవశత మేనఁ గాయంబు గలిగిన
ముద్దినములు దాని రుద్దకున్నఁ
గ్రుళ్ళి గబ్బుకంపుకొట్టి పుర్వులు రాలు
నట్టికాయమందు నాశ లేల ?

"పుట్టిననాటనుండి తలఁపున్ వలపున్ విడనాడలేనియీ
మట్టిమనుష్యునం దసువు మాయము గాఁగ, వెదుళ్లఁ ద్రాళుల
న్గట్టిగఁ గట్టి పుట్టె డగుకట్టెలఁ గట్టెను బెట్టి కాల్తు రం
కెట్టులు నమ్మి దీని కిటు లేల యలంకృతు లిత్తురో జనుల్ ?"

రతనపుంగద్దెపై మహారక్తి వెలుఁగు
నేమహారాజుఁ గని లోక మెలమి మిగిలె
ఏఁడుకట్లసవారిపై నేఁగునతనిఁ
గాంచుచున్ జేయునది లేక కనులు మూయు.

మలినముఁ బూతిగంధయుతమై క్షణభంగురమైన దేహ మీ
యిలను యదీయశక్తిఁ జలియించుచుఁ జేతనతన్ వహించునో
తెలియక దాని నేమఱుచు దేహమె నేనను భ్రాంతబుద్ధితో
మలఁగి పరేశుఁ గానఁ డభిమానము వీడఁడ యీఘటంబుపై.

‘‘మనసగుచున్నఁబల్కు దుసుమా యటుకన్నులుమూఁతవడ్డవె
న్కను,దనభార్య పిల్లలు ననాథుల మమ్ములఁ బాసిపోవ నీ
కనువగునా యటంచును మహార్తిని బైఁబడి యేడ్చుచుండిన
న్వినదు చలింప దీతనువు విప్పదు నోరది యేమిచిత్రమో?

ఉసురులు పాయువెన్క క్షణముండఁగఁజాలని పాడుబొందె ము
న్నసమము వైనభోగముల నంది జరీమడువుల్ ధరించి లే
దుసమమటంచు మీసముల దువ్వుచుఁ గానక క్రిందుమీదుల
న్మసలిన దేగదా! యిపుడు మాయురె!,సంతుకుఁ గన్న వారికిన్
విసమయి భీతినిం గొలుపువింతవికారము సెందు నెందుకో?

ప్రక్కగ నేకశయ్యపయిఁ బండి సుఖించి రమించి మించి తా
నక్కున నక్కుసేర్చి బిగియారఁ గవుంగిట గ్రుచ్చియెత్తి య
మ్మక్క! పెనంగుభార్య, పతిదైనశవంబును జేరి చూడఁగా
నెక్కొనలేక భీతిలు, వినిందిత దేహ మిదేల దైవమా!

తరువున కెన్నిదోహదవిధానము లిచ్చినఁ బుల్లవిర్గుటల్
పరువపుటాకురాలుటలు భావ్యము, లట్లె మనోబలమ్ము చే
గురుకొనినన్ సుపోషణముగూడినవేనియు దేహ మెందుచున్
నరయుట పండ్లురాలుట కనంబడకుండుట లందకుండునే?

హంస, లోఁ గల్గఁ గ్రిందుమీఁ దరయ కెగురు
హంస మేఁగినఁ గ్రోసిరా జాటకట్టు
పాపపుంబొంది నక్కలుం బట్టి తినవు
చిన్నమె త్రిండుఁ బనికివచ్చినది లేఁదు.

దహ్యేత ఇతి దేహ యనుపదం బొకండు
శీర్యేత ఇతి శరీరమన్ చిన్నమాట
దీనియస్థిరత్వమును బోధింప మర్త్యుఁ
డుట్టికట్టి యూరేఁగఁ దా నూహసేయు.

చందనాగరుకర్పూరసంకుమదము
లీపరిమలద్రవ్యంబులెల్ల దేని
స్పర్శవలన దుర్గంధసంసక్తములగు
అట్టిమలినపుఁదనువునం దాస్థయేల ?

క్రమగంగాజలమ్మొ సుగంధమధుర
శీతలజలమ్మొ క్రోలఁగాఁ జిటికెలోన
దేనిసంపర్కమున మూత్ర మానో యట్టి
పాడుదేహముపై గౌరవమ్మదేల ?

మాంసరుధిరాస్థినిర్మితమలినతను వ
దేడ ? సచ్చిన్మయం బాత్మ యేడ ? యనుచు
బుద్ధిమంతుం డెవఁడు తలపోయుచుండు
నతఁడు దేహాత్మభావన నణఁపకున్నె ?

-❋-

ప్రబోధసుధ

విషయనింద

—/—

విషయసుఖము లన్ బురదను వెఱ్ఱి యగుచు
మూఢుఁడు శరీర మెల్లను బూసికొనును
కాని దురదృష్టవృష్టిచేఁ గరఁగి జారి
దేహ గేహమే కూలు సందేహ మేల ?

తత్త్వశాంతి లేనితనుధారి యొకటనా
కోటిచింత లలమి కుములుచుండు
అగ్గి యెండుకట్టెయలనె కాల్చునుగాని
దేహమునె దహించు దీర్ఘచింత.

ఆలు కురూప సంభవిలెనా పురుషుండు మహార్తిఁ గుందు, నా
యాలె సురూప సంభవిలెనా పరు లెట్లొ వశీకరింతురన్
జాలిని మూల్గుఁ దత్పతి, నిజంబుగ మిత్రుఁడొ భిక్షువో విలా
సాలను జూపి లోఁచుకొనఁజాలెద రేమొ యటంచు కుందెడిన్.

మగనికి మించినయందం
బు గల్గుసుందరు మృగాక్షి పొందఁగఁ జూచున్
సొగసి తనకాంత మించిన
మృగాక్షికై యాశచేయఁడే పూరుషుఁడున్.

అందము చంద మున్నతనయాలు పొసర్చెడిదుష్టచర్య కా
నందములేక లేశము మనంబునఁ గ్రుళ్ళను గట్టుకొన్నవాఁ
డందుఁ బరాభిలాష గలదయ్యెనయే నిఁక వానిపాట్లు చె
ప్పందరమా? నిరంతరము వాఁడు కృశించి నశింపకుండునే?

కొడుకులు లేక సద్గతులు కూడ వటందురు వారికోసమై
పడి శ్రమలన్ వ్రతంబు లుపవాసములం దెగఁజేసి పొంద, నా
కొడుకు శఠుండొ జూదరియొ క్రూరుఁడొ మ్రుచ్చొ యటంచు దండ్రి
తాఁ, బడెడియవస్థ లిట్టివని భావనచేయఁగరాదు నిచ్చలున్.

పుట్టఁగనే సంబరమా
పట్టక రోగములు బ్రతికి బట్టను గట్టన్
మెట్టంగవలెఁగదా యని
కట్టా! పెనుచింతఁ దండ్రి కడు నెదఁ గుందున్.

పితృబంధు ఘాతుకుండో
సుతుఁడు జనకుచావు గోరుచున్ పెత్తనమే
గతి చేతి కబ్బునని తా
నతిమాత్ర ధనాధికారి యగుటకు నెంచున్.

నూటికిఁ గోటి కొక్కరుఁ డనూనగుణుం డగుపుత్రుఁ డెక్కడో
వాటిలెనా యతండు కడువ్యాధికలట్టిఁడొ యల్పజీవియో
పాటవహీనుఁడో క్కొయనపత్యుఁడొ యంచు దురంతచింతయున్
జీటికిమాటి కుండెఁగద! ఛీ కొడుకిచ్చునె శాంతిదాంతులన్.

కొడుకులు కూతు రల్లురను కోడళులున్ దనతల్లిదండ్రులున్
వడివడి సత్రభుక్కు లటు వచ్చుచుఁ బోయెడిపాంథు లంతెగా
కుడుచుచుఁ బొట్టనిండఁగులుకుం బచరింత్రు పొగడ్తలాడుచు
న్గడియిడ మిత్రభావమును గానిదినంబున శత్రుభావమున్.

నిచ్చలు మెక్కినన్ ససిగ నిండక మండెడిపాడుపొట్ట కే
నచ్చికనో శ్రమించి ద్రవిణమ్మును గొట్లకొలంది గూర్చి య
ప్పిచ్చుచుఁ బెంచి బీదలకుఁ బెట్టక నిల్వలుసేయు, దాని ని
ప్పచ్చుగఁ జేయఁ దస్కరులు బారున నేద్వకయున్న చెప్పుమా?

అనయము ఘోరపద్ధతుల నార్జనచేయుధనమ్ము లేదు పొం
దనుగద, త్రోవఁబోవఁగను దొంగలుకొట్టి హరింతు, రాపద
ల్తనికిననాఁడుదుష్టులును, దాయలునుం గలహించి లాగుదుర్
ధనమును గూర్ప దాఁపను వృథాశ్రమదప్ప సుఖమ్ము కల్గునే?

రాజులసొమ్ము రాలకు గుతాలకు నేన్గులకౌను, వారుఘో
రాజు లొనర్చి శత్రువులయాస్తులనెల్లను దోఁచి పాపముల్
మోజుగఁ జేసి దుర్ద్రవిణమున్దగఁ బోగులువెట్టి మోసముల్
సాజముగా నొనర్చి పలుసంపదలెల్లను తేండ్లు దాఁచరే.

ఇంతటిరాజయోగము వహించెడివారికి శాంతి లేద యా
వంతయు; భృత్యమంత్రివరులందఱుఁ గూడుచు ద్రోహమేమిగా
వింతురొ శత్రు లెత్తుదురొ వెగ్గల మైనవిసమ్ము పెట్టఁగా
నెంతురొ యంచుఁ జింతలు మహేశుని కేని తొలంగునే భువిన్.

సంపదలు శాంతినొసఁగవు
పెంపగురాజ్యములు శాంతిపెట్టవు, కొడుకుల్
నింపరు శాంతిని, పత్నులు
కొంపలుదీయుదు రిఁకెందుకో లంపటతల్.

-❋-

ప్రబోధసుధ

విషయనిగ్రహము

—/—

సారము లేనియీవిషయజాలజలమ్మలతోడ నిండుసం
సారసముద్రమందుఁ బెలుచన్ నరదేహమె నావ,అద్దియున్
సాకెకుఁ గర్మరూప మగుఝుంఝు కలంపఁగ నిట్టునట్టు కం
గారునఁ గొట్టుకొంచుఁదట కాపడుచుండును దేలియాడుచున్.

తొమ్మిది యైనరంధ్రములతో నడయాడెడి దేహనౌకఁ దా
నెమ్మది జీవనావికుఁడు నెట్టును, సోమరిపోఁ తతండునుస్
దొమ్మిదిచిల్లులన్ గడకతోడుత మూయక సాగనేని యొ
క్కుమ్మడి నీరుసొచ్చిమునుఁగున్ నడిసంద్రములోఁబ్రమాదమై

నవరంధ్రంబులు మూసిన
నవలీలగఁ బడవ సేర్చు నవ్వలియొడ్డున్
భువి సనృతదుఃఖజలదు
ర్భవజలధిని నిగ్రహమ్మె పారము చేర్చున్.

తనకు లభ్యముగా దని తలఁచికూడఁ
బరునిభార్య నపేక్షించుఁ బాడునరుఁడు
వ్యర్థయత్నముచేఁ బాపి యగుటకంటె
యెట్టిమే లట్టి దానఁ జేపట్టినట్టు?

పలువడిఁ గొండెగాండ్రొకరిపై నొకరెన్నొ దోసంగులెన్నుచు
న్బలుకుచునుండఁగాఁ జెవుల భద్రముగా వినుచుందు రట్టివా
క్కులఁ బడుమానవుం డదరి కూలున నొచ్చున? అట్టివానిచే
విలిచినకిల్బిషం బనుభవించుట తప్ప మఱేమిలాభమో?

శాపములం బలునిందల
పాపపుటనృతముల నాల్క పలుకును; వానన్
దాప మితరులకుఁ గలుగదు
పాపాత్ముం డగుటతప్ప ఫల మేముండున్?

క్షణికసుఖార్థ మీనరుఁడు చచ్చెడిదాఁక రుజార్తినందు న
య్యనుభవమైనతో మిగులన్నె నది బాధ యొకండె కానఁదా
ననయము స్వల్పసౌఖ్యముల కాశ యొనర్ప కనంతదుఃఖసం
జనితమహాప్రమాదమును జక్కఁగ దాఁటవలెం బ్రబుద్ధుఁడై.

గాలమునందు నున్న యెఱకై యడి యాసనుఁబూని చేఁప దు
ష్కాలవశాన మ్రింగి చెడుఁగావున నట్లె; సుఖైకభోక్తయై
కాలముచేత లాగఁబడిగాదె జనుండు నికృష్టుఁడై చెడున్
మే లిది యిద్దికీ డని సమిద్ధమతిన్ గని చేయ క్షేమమా.

పాము నోట సగము పడ్డమండూకంబు
ఎగురుఁబుర్వులన్ గ్రహించి మ్రింగు
ఆయు వఱుట నంధుఁడౌచు గుర్తింపక
విషయసౌఖ్యములకె వెదకు జీవి.

"పట్టుసేల గట్ట వట్టిగోనెలు గట్టఁ
గాంచనంబు మెసవ గంజి త్రావ
ఫలిత మొకఁడె యంచు తెలియుచు విషయని
గ్రహము గలిగి యుండు మహారహంబు."

-✻-

ప్రబోధసుధ

మనోనింద

—/—

ఒకపుడు నవ్వుచుండును, మఱొక్కపుడేడ్చును భ్రాంతిచెంది, తా
నొకపుడు దిగ్దిగంతముల కోపికతోఁ బరువెత్తు, సంతసిం
చొకపుడు కోపగించును మఱొక్కటఁ దిట్టును శిష్టపద్ధతిన్
ప్రకటితదుష్టపద్ధతి సభాజనసేయు మన స్సొకప్పుడున్.

పరులను నిందసేయుఁ బరిపాటిగ మెచ్చును దన్నుఁ దానె, దు
ర్భర మగునాశ లంది యది రక్కసియే యగు; దంభలోభమ
త్సరములఁ బొంది కుక్కవలె సారెకు నిట్టటు పాఱుఁ గావునన్
గుఱిగ విరాగ మూని యది గోరినవానిఁ ద్యజింపఁగావలెన్.

అది కావలె నిది కావలె
నది తె మ్మనుచుండు మనసునానలతోఁ బా
టది వల దిది చేయకు మను
తదీయవాంఛల నణంపఁ దగు విజ్ఞునకున్.

పరిశుద్ధవిరాగాగ్నికి
గుఱిసేయుము మనసు కోరుకోర్కెచిదుకులన్
ధరణిన్ వాంఛ లణంగిన
తఱి నిర్వ్యాపార మగుచుఁ దా స్థిరతఁ గనున్.

మనోనింద

"బంధమునకేని మోక్షసంపదకు నేని
మనసె మనుజులకెల్లఁ గారణము సుమ్మ
నిగ్రహప్రగ్రహమున బంధించి దాని
నంచి బహుభద్రముగ నడిపించికొనుము.

ఇంద్రియపంచకంబే హోతృసంఘము
ఆజ్యధారయె విషయాభిలాష
వాసనేంధనముల భగభగ మండుచు
న్లోకముల్ గాల్చు మనోమయాగ్ని

భవబంధహేతువై పరగును మానస
మదె యవిద్యారూపమై చెలంగు
అది నశించిన సకలార్థముల్ నశియించు
నది విజృంభింప సమస్తమటులె

నిజబలముచేత శూన్యమౌ నిద్రయందుఁ
జిత్రలోకము సృష్టించుఁ జెడు సుషుప్తిఁ
గాన సంసార మీమనఃకల్పితమయి
నరుని కంటెడి నాత్మ కంటదు నిజమ్ము.

గాలియే జలదములఁ జిక్కఁగను గూర్చి
గాలియే విడఁగొట్టినకరణి, మనసె
బంధములఁ గూర్చి వైరస్యభావనమున
విరజమై బంధముల విప్పివేయుచుండు.

మన సనెడి మహావ్యాఘ్రం
బనుదినమును దిరుగును విషయాటవులందున్
కని సాధువులు ముముక్షులు
చనరా దటు; భంగ మాత్మశాంతికిఁ గలుగున్.

తాను సుఖపాప మొనరింపఁ బూను గాని
కష్టధర్మ మ్మొనర్ప నిక్కట్టువడును
నియమనిష్ఠల దాని బంధింప, నీవు
చెప్పినటు లొనరించుదాసి యగు నవల."

-❋-

మ నో ని గ్ర హ ము

—/—

తనలో నూరిననీటితోడ నది యత్యంతంబు నీచంపుదా
రిని జేపట్టి సముద్రముం గలియఁ బేరే లేక క్షీణించెడిన్
దననీ రాపికొనంగ నానదియె యుద్యత్సింధు వౌ; నట్టులే
మనసున్వీడక నిగ్రహించికొన నాత్మత్వంబుఁ దానందెడిన్.

తనకుం దనకృత్యములకుఁ
బనుపడుసద్ధేతు వైనవస్తువును విచా
రణసేయుచు లోనణఁగిన
మనసే యాత్మత్వ మంది మను నది కరణిన్.

వాననీటితో నిండిన బావినీరు
భూమిలోనిధారలఁగూడి పొంగునప్పు
డుప్పఁదన మిచ్చు, వేసవి ముప్పిరి గొన
నడుగు నంటిననీరు తియ్యగను దోఁచు.

అట్టులే విషయోద్రిక్తమై తమఃప్ర
ధానమైనమనస్సు సంతతముఁ గలఁగు
అది విరాగమ్ముచే శుష్కమైనయపుడు
సత్త్వ ముత్పన్న మగుచును శాంతి నిడును.

ఎట్టివిషయసుఖాల కపేక్ష చేసి
ప్రగతి బహిరింద్రియద్వారముగ మనస్సు
పర్వులెత్తునో, అవి యలభ్యమ్ములగుడు
నేదొ తనకొంప మునిఁగిన ట్లేడ్చుచుండు.

నగనగరదుర్గదుర్గమ
జగన్నదీనభములెల్లఁ జక్కఁ దిరుగుచున్
బొగులును గోర్కులు తీఱక
నగలుచు విషయంత్రబద్ధమై నలఁగునటుల్.

జలములలో సొరకాయను
బలముగ లోపలికి నదుమఁ బైకెగయునటుల్
చలచిత్తమెంతయదిమినఁ
గలఁగుచు నింద్రియముఖమ్ములగా వెలికుబ్బున్.

పూర్వపుంబుట్టువందు నీ పుట్టువందు
గాని, స్వీయకర్మార్జితంబైనఫలము
శుభము యశుభము తా లభించును దనంత
కావునఁ బ్రయత్న మేల నిష్కారణంబ.

తప్పుదారులఁ బర్వులెత్తఁగఁ దలంచు
హృదయపశువుఁ దా నాపగా నెంచిగాదె
కడఁక వైరాగ్య మనుగుదిగట్టి నొకటి
తడయక సృజించినాఁడు విధాత మొదలె.

దిట్టపునాల్గుగోడలగదిన్ బలవంతము నొక్కబెబ్బులిన్
బెట్టినయంత నయ్యది గుభీలు గుభీలునఁ బైకి దూఁకుచున్
దట్టుచు గోడలన్ బడుచుఁ దక్కుచు రొజుచుఁ బోవ దారి లే
కెట్టులు కూలు, నట్లు లఖిలేంద్రియబంధమునన్ మనంబు తా
నిట్టటు పోవలేక బల మింకి నిరుద్యమ మూచు శాంతిలున్.

భోగదేహాదివాసనాత్యాగములను
హరిచరణసేవకతన ధ్యానాదివిధుల
భజనములను బ్రాణాయామపద్ధతులను
జిత్తవేగచంచలతలు ఛిన్నములగు.

"అభిమతం బైనతత్త్వాదికంబున చిత్త
    మును నిల్ప వశత చేకొనఁగ నౌను
సుఖదుఃఖములయందుఁ జూప మైత్రిని, పుణ్య
    పాపభావనను జేపడును మనసు.

లోగాలిఁ దగునట్టులుగ విసర్జించుటఁ
    గుంభకాదులను జేకొనును స్థిరత
శబ్దాదివిషయసంసర్గచే, నాసాగ్ర
    దృష్టిచే నెద నిగ్రహింపనగును

అకలంకమైనసాత్వికసత్త్వకాశావ
    లోకనమ్మున నెద లొంగిపోవు
లోకతంత్రముల లోలుపతయు, తద్భావ
    నము లేకయున్న స్వాంత మ్మణంగు

అభిమతం బగువస్తువునందు నేని
రామకృష్ణాదులందు నే రక్తి నిలుప
చిత్తమునకు నేకాగ్రత యత్తి యవల
అణువు మొదలు మహత్తత్త్వ మందుకొనును."

-❋-

ప్రబోధసుధ

మనోలయము

—/—

అరయన్ సంసృతితాపతప్తమయి పెక్కా యోనులం బుట్టుచున్
మరణం బందుచుఁ బుట్టుచుందిరిగి, నానా క్లేశముల్ చెందుచున్
స్థిరతల్ లేక కలంగి వేసరినయీచిత్తం బదేనాఁటికేన్
పరమానందము నందెనేని చలియింపంబోవ దెప్పట్టునన్.

తానద్వైతానందము
నూనుచు "ఎవ్వఁడను నేనహో యిది యేమో?
నే నెవ్వరివాఁడ" నను న
ననూనవితర్కమునఁ జిత్త మొందును మూర్ఛన్.

చిరతరాత్మానుభవముచేఁ జిత్త మెప్పు
డాత్మరూపంబె తానంది యలరుచుండు
ఆమహోదధిఁ గలిసినయట్టినదియు
నున్నతసముద్రభావము నొందుఁ గాదె!

ఆత్మయందు లయం బయినట్టిచిత్త
మన్యవిషయసుఖాపేక్ష నంద దెపుడు
ఎన్న క్షీరోద్ధృతం బైనవెన్న మరలఁ
దాను క్షీరభావంబుఁ బొందనివిధాన.

అమలదృష్టియందు నాద్రష్టయందును
దృశ్యమందున నెడఁదెగక యేది
వెలుఁగుచుండు; దానఁ గలిసినచోఁ జిత్త
మపుడె వృత్తిరహిత మగునుజువ్వె.

దృఙ్మాత్రమందున దృశ్యంబు ద్రష్ట
దృష్టియన్ భేదాల త్రిపుటి జనించె
ఆమూఁడు దృఙ్మాత్రమందు లయింప
దృగ్రూపపరమాత్మయే యొందు మిగులు.

అద్దంబు లేనిపూర్వావస్థయందు
నద్దంబుఁ దొలఁగించునవ్వలంగూడ
ముఖ మున్న; దద్దంబు ముం దుంచినపుడె
ఆననప్రతిబింబ మందుఁ జూపట్టు
అద్దము తొలగింప నాప్రతిబింబ
మంతరించి ముఖంబునం దుండు ముఖమె.

(చివరి రెండు పద్యముల భావము)

వ. దృఙ్మాత్రమందు (అనగా జ్ఞానరూపపరమాత్మ మందు) దృశ్యద్రష్టృదృష్టిభేద మనుత్రిపుటి మనస్సాన్నిధ్యమువలన క్రొత్తగా పుట్టినది. మనోలయావస్థయందు ఆత్రిత్వము ఆదృఙ్మాత్రమునందు లీనము కాఁగా దృక్కుమాత్రమే మిగులును—

అద్దము లేకపూర్వము ముఖమున్నది. అద్దము తొలగించిన వెనుకగూడ ముఖమున్నది. అద్ద మెదుట నుంచినపుడుమాత్రమే ముఖప్రతిబింబము తోఁచును. అద్దము తొలగించిన పిమ్మట ఆప్రతిబింబము నశించును. అనఁగా నపుడు అద్దములో కనఁబడినముఖము (ప్రతిబింబము)ముఖమే (బింబమే) అయినది.

అట్లే మనసు లేనపుడు పరమాత్మ మున్నది. మనసు లయమైనపిదపగూడ ఆపరమాత్మ మున్నది. మనస్సున్నంతసేపు అందు పరమాత్మ ప్రతిబింబించి జీవత్వము పొందినది. మనోలయము కాఁగా అందలిప్రతిబింబము (జీవత్వము) పోయినది. అపుడు మనసున ప్రతిబింబించినపరమాత్మ (జీవుఁడు) జీవత్వము విడిచి బింబరూపమును (పరమాత్మరూపము) పొందును. ఇదేమనోలయము.

ప్రబోధసుధ

వైరాగ్యము

—/—

పరులకళత్రముల్ సుతులు భాగ్యములెల్లను నష్టమందనీ
నిరతిశయాభివృద్ధి మననీ పయివాని కవేల ? యట్టులే
కరము ప్రమోదమైసుఖమొకష్టమొనష్టమొలేదొ యున్నదో
యెఱుఁగనిరీతి గేస్తు తనయింట వసింపసుఖంబువాటిలున్.

పూని మమతాభిమానముల్ మానుకొనుచు
విషయసుఖపరాఙ్ముఖతను వీడఁబోక
దైవయోగంబుపైని నాధారపడుచు
నింట వసియింప గేస్తున కేమికొరత ?

పచ్చికబైళులం దిసుకపట్టుల దట్టపుఁజెట్లనీడలన్
నచ్చుగఁ బండి; కోనలు ననంతశిలోచ్చయగంధవాహముల్
పచ్చనికుంజముల్ పువులుఁ బల్కెడికుల్కెడిపక్కిగుంపులున్
నిచ్చలుఁ జూచువాని కవి నెచ్చెలు లౌటది యబ్బురంబొకో?

వైరాగ్యభాగ్యభాజులు
కోరక యిచ్చెడిఫలంబుఁ గుడుచునిరాశుల్
తేరినయెడంద కలవా
రేరో వనములన ధన్యు లెంచఁగ వారల్.

ధన మెటో జారిపోయిన వ్యథం గలిగించును, శ్రౌతి కిచ్చుచో
నినుమడి తుష్టిపుష్టులను నిచ్చు, నటే విషయాలి నడ్డుపె
ట్టనితటి స్వేచ్ఛగా నడపుటన్బనుదుఃఖముఁ గూర్చు, దానె వా
నిని విడువన్ సుఖాంతమగు నిర్మలమోక్షసుఖం బొసంగెడిన్.

శాంతం బాత్మనివాసము న్మరచి సంసారాటవిం బర్వుచున్
సంతాపత్రయదీర్ఘదావదహనజ్వాలావలీతప్తమై
గంతుల్ వేయుచు నాశలన్ వలలఁ జక్కం జిక్కి నన్ చిత్తమున్
భ్రాంతం బౌమృగము న్వృథావిషయదుష్టవ్యాఘ్రి హింసింపదే!

-❀-

మాయాసిద్ధిశక్తులు

—/—

తానై తన్నవలోకనించెనట చిన్మాత్రుండు లోకేశుఁ డ
ద్దానన్ సోహ మటన్న పేరు గనె, భేదం బందుచేఁ గల్గి య
ద్దానన్ దాఁ బతిగాఁగఁ బత్నిగను ద్వైధంబందెనందుండి సం
తానం బైతగునాకసంబు వొడమెన్ త్రైధప్రకారంబుగన్.

బ్రహ్మసంకల్పమాత్రసంబంధమునన
జనన మందెను మానవజాతి యనుచు
యాజ్ఞవల్క్యుఁడు తనదు భార్యకును దెలిపి
నట్టు లుపనిషత్తులు వక్కా నాదరమువ.

సుచిర మానంద మనుభవించుపరమాత్మ
కా సుషుప్తినిబోలి వింతగునవస్థ
వరలె, నాతనినుండి స్వప్నంబుఁబోలె
మాయ యుద్భవమందె నెమ్మదిగ నపుడు.

ఉన్నదియు లేనిదియుఁ గాఁగ నుండి మాయ
తాను సదసద్విలక్షణతన్ గడించె
నదియు నాత్మను జేరి యనాది యగుచు
నఖిలలోకాలఁ గనెఁ ద్రిగుణాత్మకమయి.

కలలోనన్ సురతానుబంధమున శుక్రస్రావముం గల్గదే
స్ఖలనం బౌట నిజం బటంచు శుభవస్త్రం బేగదా చాటెడిన్
కలలో బొందినకాంత, తద్రతియునున్ గల్లల్ గదాపూరుషుం
డలవస్త్రార్ద్రితయున్ యథార్థములు కావా? అద్వైతతత్సృష్టియున్

మాయ తా నదృశ్యంబయి మసలుఁగాక
దృశ్యమగుజగత్తులఁ దాను సృష్టిసేయు
స్వీయనాశంబుకలన నామాయయే స
మస్తజనులను నానంద మందఁజేయు.

అట్టిమాయ యిట్టిదై ప్రవర్తించెడి
అంతు పంతు లేనియామినివలె
కన్ను లెఱ్ఱచేసి గాంచిరే న్నానివరు
లద్ది మెఱుపువోలె నస్తమించు.

అదియు బ్రహ్మాశ్రయమున మాయ యనఁబరగు
వేళ జీవాశ్రయంబై యవిద్య యగును
మనసు చిదచిత్తులగ్రంధి యనఁగఁ జెల్లు
అది నశింపదు మోక్షము నందువఱకు.

ఘటమఠవృత మాకాశం
బెటువలె వేర్వేరుపేర్ల నెంచంబడునో
యటువలె నవిద్య కప్పిన
పటుచైతన్యంబు జీవపదసంజ్ఞిత మౌ.

స్వప్రకాశుఁడౌ అర్యమస్వామి నెపుడు
రేయిచీకటి బాధింపలేనియటులు
ఆవిశుద్ధపరబ్రహ్మ మావరింప
మాయ కేపాటిశక్తిసంపదలు గలవొ ?

అర్కకిరణాల నుద్భవ మందినట్టి
అభ్ర మారవిఁ గప్పదే యలమికొనుచు
వికృతసాంద్రమహామేఘవితతిచేత
దినము దుర్దిన మగుటయుఁ దెల్లమెగద!

పూత శుద్ధాత్మయుఁన్ మాయచేత నల్లె
చిరము కప్పఁబడుటయుఁ బ్రసిద్ధమెకద!
కనుకనే ప్రాణులందుఁ జక్కఁగ వసించు
చేతనాశక్తి యణఁగి దర్శింపఁబడదు.

అంతులేనిదై నిత్యనిరంశ మగుచు
నిర్వికల్ప మఖండమై నెగడివెలుఁగు
తత్త్వమందు జీవేశభేదమును గూర్చు
మాయ యఘటితఘటనాసమర్థ మహహా!

నిగమనిగమాంతశోధనల్ నెఱపియున్న
పండితులనేని విత్తలోభమ్ము సూపి
పశువుల నొనర్చి కాలుష్యపఱుచుచుండు
మాయ యఘటితఘటనాసమర్థ మహహా!

అద్వితీయ మఖండబోధాత్మక మగు
నాత్మఁ బాంచభౌతిక దేహ మనుచుఁ జెప్పి
త్రిప్పు సంసారసాగరాతిథిగఁ జేసి
మాయ యఘటితఘటనాసమర్థ మహహా!

దలితగుణవర్ణజాతిభేదమ్ము చిద్ఘ
నమ్ము, దానికి జాత్యాద్యహమ్ముఁ గూర్చి
యలమి సుతదారగేహమోహ మ్మొసంగు
మాయ యఘటితఘటనాసమర్థ మహహా!

విధిజనార్దనశివమూర్తిభేద, మాయ
ఖండచిద్రూపమునకుఁ జక్కఁగ నమర్చి
వేత్తలఁ ద్రిమూర్తిభేదప్రవృత్తిఁ ద్రిప్పు
మాయ యఘటితఘటనాసమర్థ మహహా!

-❋-

ప్రబోధసుధ

లింగదేహాదులు

—/—

స్థూలమునందుఁ జొచ్చుకొని సూక్ష్మం బుండు
సద్దానఁ గారణం బమరి యుండు
కారణంబున మహాకారణం బగునాత్మ
నాలవదేహమై యోలి నుండు
వెనుక స్థూలము నిరూపితమయ్యె నిప్పుడు
సూక్ష్మంబు వివరించి చూపుచుంటి
"తధ్య మంగుష్ఠమాత్రః పురుష" యటన్న
శ్రుతి సూక్ష్మదేహసంగతిని దెల్పె

ఐదుభూతముల్ ప్రాణము లైదు నింద్రి
యములు నైదు మనస్సుతో నైనయట్టి
యాపదారును సూక్ష్మదేహం బటండ్రు
దీనినామాంతరమె లింగదేహమగును.

లింగతనువులో లోపల సంగతమగు
వాసనలె కారణశరీరభాగ మగును
జ్ఞానబంధము గలవాసనాప్రవృత్తి
యే, మహాకారణశరీర మిది గ్రహించు.

దానిసారభూతం బయి దనరు బుద్ధి ;
దాన బింబించు శుద్ధచైతన్య మగును
జీవుఁడు; అత డీతనువు నంటి చెలఁగుచుండి
ఏను నే ననుచున్ స్ఫురియించుచుండు.

కదలుచున్న సరిత్తరంగములయందు
అర్కబింబము కదలుచున్నట్టె తోఁచు
అటులె చలత చిత్తమున కున్నట్టికతన
తచ్చలత తోఁచు శుద్ధచైతన్యమునకు.

జలగతం బగురవిబింబ మిలఁ బదార్థ
ములను గాన్పింపలేనట్టు, బుద్ధిగతచి
దాత్మబింబముగూడఁ బదార్థచయముఁ
గానఁబడఁజేయలే దశక్తంబుగాన.

అమలకాంస్యాదిపాత్రలయందు ససిగ
ప్రతిఫలించినరవికాంతి భవనమందుఁ
జొచ్చి యితరవస్తువులను జూపలేదె ?
అటులె లో నున్నయాత్మకృత్యముఁ దలంపు.

చిత్తు బింబించి బుద్ధిలోఁ జేరియుండి
తాను జీవమై యింద్రియతతిని గూడి
తనువునకుఁ గల చెవి కన్ను దారు లంటి
వెలుపలిపదార్థతతిని భావింపఁజేయు.

-❋-

ప్రబోధసుధ

అద్వైతము

—/—

ఆర్యుఁ డెవ్వఁడు "బ్రహ్మాహ మస్మి" అనుచు
నరయునో నాతఁడే సర్వ మగుచునుండు
వానియైశ్వర్యమునకు దేవతలభూతి
గూడఁ జాల దటంచు వాకొనఁగవలదె ?

ఎవ్వఁ డాత్మస్వరూపమై యెసఁగు నేను
వే ఉపాసించుదైవము వే అటంచు
భిన్నభావముతోడ సేవించునో, య
తండు పశుతుల్యుఁ డనుచు వేదములు సెప్పె.

జ్ఞాని యాత్మస్వరూపుఁడేగాని వేఱు
కా డనుచు వేదశిఖలును వేదము లనె,
కృష్ణభగవానుఁ డాడినగీతలందు
నట్టు లున్నది, యుక్తియు నటులె గలదు.

ఒడు పైనచేతికఱ్ఱకుఁ
గడువంకర, తిన్నఁదనముఁ గానంబడినన్
వడి నగ్నిఁ గాల, వక్రత.
యడఁగుచుఁ దా నగ్నిరూప మందునుఁగాదే ?

అట్టి యాత్మనిష్ఠుఁ డైనమహామహు
డాత్మరూప మందు టబ్బురంబె?
దేహివలెనె మనకు దృగ్గోచరుండైన
నతఁడు కేవలాత్మ మగునుగాదె.

భానుబింబ మొకఁడె; ప్రతిఫలించుచు, జల
ఘటములందుఁ బెక్కులటులు తోఁచు
నట్లె యాత్మ మేకమై యనేకశరీర
ములను భిన్నరీతి నిలిచియుండు.

పగులుచో నొక్కకుండ దౌర్భాగ్యవశత
నణఁగిపోయెన యాదిత్యుఁ డాకసమున?
అలలకదలికఁ బ్రతిబింబచలన మగుడు
నట్టిచాంచల్య మారవి కంటునోటు?

ఒక్కసవిత ప్రకాశించుచుండ, జనము
లెవరిపనులు వారలు నిర్వహించికొనరె?
అట్లె యేకాత్మబలమున నఖిలజంతు
జాలముఁ జరించుచుండుట సత్య మవని.

పనస లనఁటులు జాజిసంపంగులెల్ల
నేజలముచేత నిత్యాభివృద్ధి నందె
భిన్నరసగంధయుతములై పెరుగలేదె
దానిచే నల్లి మునఁగలు నానుగులును?

చక్కఁగ సూత్రధారి తెఱచాటుననిల్చియుఁ తోలుబొమ్మల
న్నిక్కిలిసేర్పుతో నటన మించఁగ నార్చెడిరీతి నాత్మ తా
నొక్కఁడె సర్వజంతువుల నొప్పుగఁ ద్రిప్పుచుఁ గానరాక పెం
పెక్కిననేర్పుతోడ నడిపింపఁడె యీభువనాళి నెప్పుడున్.

బెల్లము ఖండశర్కరయు ఫేనిక చక్కెర యిక్షుభేదమై
చెల్లినరీతి;నుంగ్రములుఁ జేకడియంబులుఁ గుండలాదిక
మ్మెల్ల సువర్ణభేదకములే యయినట్లు; లనేకరీతులన్
బెల్లగువృత్తులన్ రుచుల వేఱగునాకృతుల న్వెలుంగుచున్
జెల్లెడియీప్రపంచ మొకచిన్మయుచేఁ గదలింపఁగాఁబడున్.

బుజముపై నన్ను మున్నంతఁ బుష్టి గలిగి
నడచువాని కాకలిదప్పు లుడుగఁబోవు
దానిభుజియింప వానిబాధలు సమస్త
మణఁగు నట్టులె పరమాత్మ నందవలయు.

మానుషమతంగసూకరమహిషమశక
కాయముల ననుస్యూతమ్మగా వసించు
నాపరేశ్వరు నెవఁడు సత్యముగ నెఱుఁగు
నతఁడె యద్వయానందంబు ననుభవించు.

-❀-

ప్రబోధసుధ

ఆత్మస్వరూపము

—/—

బుద్బుదము నీటినుండియే పుట్టియున్నఁ
గాని, నీటికన్నను వేఱు గాఁగ దోఁచు
నట్లె, యాత్మకన్నను భిన్న మగుచుఁ దోఁచు
ఈప్రపంచం బనేకధా యెసక మెసఁగి.

బుడగ లెల్ల నశింప నంబువు నశింప
నటులె, లోకముల్ నశియింప నాత్మ చెడదు
కుబుసము నశింపనీ యహి కున్న హాని?
అటులె దేహముల్ నశియింప నాత్మ చెడదు.

కరకమట్లు భాసించు మేఘమును బొంది
జలము; కరకనాశమునఁ దజ్జలవినాశ
నమ్ము గలుగనిరీతి; దేహమ్ము లంది
యవి చెడిన ఆత్మ నాశన మంద దెపుడు.

పుష్పములు వాడి నశియించిపోవుచున్న
వానిలోనిదారము నశింపనివిధానఁ
దనువులు నశించుఁగాక చైతన్యరూప
మైనయాత్మ యెన్నడు నాశ మందకుండు.

సూర్యకాంతి పర్యంకరజ్జువులరంధ్ర
ములఁ జొఱంబారి భిన్నతఁ బొంది నట్లు
వివిధదేహంబులం దుండి వివిధరీతి
గడలుకొనునాత్మరూప మొక్కటియెగాదె!

అగపడుచునుంట 'నేను' దేహంబుగాదు
ఇంద్రియము గాదు భౌతిక మే యదగుట
ప్రాణమునుగా దనేకత భాసిలుటను
స్వాంతమును గాదు చంచలత్వము గలుగుట.

సంతతమ్మాత్మ నిద్రా దేహజాతములగు
వ్యథలు కథలు జాగ్రద్దేహ మంట నటులె
ససిగ జాగ్రచ్ఛరీరసంజాతకష్ట
సుఖములును నాత్మ కంటవు శుద్ధ మగుట.

నీలరక్తాద్యుపాధుల నిర్మల మగు
స్ఫటిక మేరీతి లిప్తతన్ బడయ, దట్లె
కోశజము లైన కామాదిగుణవిలేప
మంద దెప్పుడు నిర్మలం బైనయాత్మ.

హ్రదములన్ రవి యొక్కఁడే ప్రతిఫలించి
పెక్కుసూర్యులవలెఁ దోఁచుఫక్కిగానె
అయుతతనువుల నున్నట్టియాత్మ కూడ
ఏకమే, యైనఁ దోఁచు ననేకగతుల.

ఆత్మస్వరూపము

అంబుదప్రకాశనచణుఁ డైనసూర్యుఁ
డంబుదచ్ఛన్నుఁడయ్యు నెట్లలమి వెలుఁగు
అటులె మోహప్రకాశక మైనయాత్మ
మోహసంఛన్నమయ్యు నొప్పుగ వెలుంగు.

నీటి కున్న శైత్యాదులు నీట నున్న
భానుబింబము నంటనిపద్ధతిగనె
బుద్ధికున్నకర్మాదికంబులు, చిదాత్మ
కంట నేరవుగాదె సత్యముగఁ దలఁప.

క్షీరయోగంబు పొందిననీర మెట్లు
పాలవలెఁ దోఁచుచుండు నాఫక్కిగానె
ఆత్మయోగంబుచేత ననాత్మగూడ
ఆత్మవలెఁ దోఁచుచుంట భావ్యమ్మ జగతి.

కదలుచున్న సరిత్తరంగములయందు
ప్రతిఫలించిన సూర్యబింబములచలన
మర్కబింబమ్మునకు నుంత యంటనటులె
చక్కఁగ నెఱుంగు మాత్మ నిశ్చల మటంచు.

ప్రబోధసుధ

ఆత్మస్వప్రకాశత్వము

—/—

రవిచంద్రు లగ్ని దీపము
లవనిం దముఁదాము నితర మగువస్తువులన్
తవునటులు వెల్గఁజేయును
బ్రవిమలతత్త్వంబు వాన భానం బగునే?

అక్షిద్వారముగానే
సాక్షా దాత్మంబు వానిఁ జక్కఁగఁ జూపున్
ఈక్షితి వెలుఁగున్నను దా
నీక్షింప దనాత్మ దేహ మేయర్థంబున్.

ఆత్మ ముండుటఁ గంటిచే నైనభాన
మింద్రియేతరమునను గ్రహింప నగును
కన్ను గాననియంధుఁడుఁ గరము చేత
తడవి గుర్తింపఁడే వస్తుతతిని జగతి.

దేనిచేఁ బదార్థములెల్లఁ దెలియఁబడునో
నొనరఁ దానిఁ దెల్పునది వేఱొండు లేదు
కాన నాత్మయే యాత్మను గాంచఁగలుగు
నని యుపనిషత్తులీయర్థమునె వచించె.

-❋-

ప్రబోధసుధ

కర్తృత్వభోక్తృతలు

—/—

రవి యుదయించినయంతనె
యెవరిపనుల్ వారు చేయ నెంతురుగాదే
రవి చేసెన చేయించెన?
అవనీస్థలి నాత్మతత్త్వ మట్టిదికాదే?

జ్వలనవ్యాప్తం బినుమును
వలనగుసమ్మెటలఁ గొట్టివైతురు, దానం
గలయగ్గికి నాఘాతం
బుల వేదన యంట దాత్మముం గను మటులే.

వాఁడిగొడ్డండ్ల చేఁ దరువర్గమెల్ల
నఱకఁబడుచున్న నేని యంతర్గతంబు
వహ్ని భేదింపఁబడనట్లు వాసిఁగాంచు
నాత్మతత్త్వము సత్యము నరసితేని?

దేహసంబంధజ మ్మయి తేజరిల్లు
నమితసుఖదుఃఖచయ మాత్మ కంట దెపుడు
తినకపోయినచోఁ గృశించునదిగాని
తినిన బలు పెక్కునదిగానిదే చిదాత్మ.

దైవవశంబున నింటను
నేవాఁడయినన్ జనించెనేని, రుజాదిన్
జావంగనేని, దీపము
భావంబున నోషదుఃఖభాజన మగునే?

వేశ్మమున రేయి దీపము వెలుఁగుచున్నఁ
జోరుఁడు ధనమ్ము నపహరించును జొఱఁబడి
పలుక దడ్డదు దీప మవ్వాని, నటులె
ఆత్మకుం గలసుస్థితి నరయవలయు.

-❋-

ఆత్మసిద్ధి

—/—

పుట్టఁగనీ విరాగము ప్రబోధము లేకది సౌఖ్య మీయ దె
ప్పట్టున, నాప్రబోధ మొకపూజ్యగురుం డుపదేశ మీయకే
పుట్టదు కావున న్నరుడు ముందుగ సద్గురు నాశ్రయించి జే
పెట్టి గురుప్రసాదము లభించువిధాన ప్రయత్ని కావలెన్.

ఉదధి నపార మానుదక ముండఁగనిమ్ము సమీరణుండు నా
యుదధిని త్రేఁచి భంగముల నుబ్బఁగఁజేయఁగనిమ్ము కాని, తా
నదవద గొంతు మాడఁగ మహార్తిని గుందెడిచాతకమ్ము వా
రిదమునకై నిరంతరనిరీక్షణ చేయుచునుంట గాంచమే?

శాస్త్రవచనము, నాత్మవిశ్వాస మనఁగ
సద్గురుప్రబోధ మనఁ బ్రశస్తి గాంచి
యిలఁ బ్రమాణము ముత్తెఱంగు లగుచుండు
వాని నీరీతి గుఱుతింపవలయు నరుఁడు.

తియ్యగ నుండు బెల్లమని తెల్పుట శాస్త్రవచస్సు, దూరమం
దయ్యదెచూడు బెల్లమని యాడుట యాను గురుప్రబోధ, మా
తియ్యని బెల్లముం దినఁగఁ దేలిన సౌఖ్యమె యాత్మసిద్ధి యా
నయ్యెడ నీప్రమాణములనే నరుఁ డెంచఁగఁ బోలు నెప్పుడున్.

స్పర్శరసగంధరూపశబ్దములసుఖముఁ
దదితరపదార్థజాత మోదమును గాని
యనుభవించున దేదియో యరయవలయు
నట్టిశక్తి యీ దేహేంద్రియముల కున్నె ?

మృతదేహేంద్రియవర్గము
చితిఁ గాలుచునున్న బాధ చెందదు గానన్
మతిమంతుఁ డట్టిమోదము
నతుకఁడు దేహేంద్రియముల కగునం చెపుడున్.

ప్రాణములే యయ్యనుభవ
మాను ననిన, నిద్రయందు నవి గల్గియు సుం
తైనను దస్కర బాధను
గానవ, అయ్యనుభవంబు గన వాని కెటుల్ ?

మనసున కున్నదన్న నొకమాఱుగనే విషయాళి నెల్లనున్
గనుచు గ్రహింపదేమిటికి? కాక మనస్సు పరాత్తవృత్తిచే
మనుటనగాదె యెన్నియొ ప్రమాదములున్సమకూఱు నట్టిచో
మని చెడివాఁ డెవండొకో ప్రమాదపరిస్థితినుండి యిజ్జనున్?

చిక్కని చీకటింట భువిఁ జేర్చుము కాంతిగలట్టిదివ్వె నో
చక్కని, పంచరంధ్రకలశమ్మును దానను బోరగించుమీ,
గ్రక్కన పైఁడి, వీణ, మణి, కస్తురినిన్, వ్యజనమ్ముఁ గండ్లపై
ప్రక్కలఁ జేర్చు; కాంతియును రంధ్రముఖంబులఁ బైకిరాఁగనం

దెక్కడి దేపదార్థమొ గ్రహింపఁగ నౌఁగద; యిట్టి తెల్వి నీ
కెక్కడిదయ్యె? యాకలశ మిచ్చెనె? చిల్లుల? మృత్తె? సూనెయా?
చక్కఁగ నెన్న దీపమె నిజంబగు కారణమంచుఁ దోఁచు నా
ఫక్కినె యాత్మదేహముల భాసిలుఁ దోఁచుఁ బదార్థతత్త్వముల్.

-❋-

ప్రబోధసుధ

నాదానుసంధానము

—/—

క్షణము యొక్క క్షణార్ధమో స్వస్వరూప
చింతన మొనర్ప నీవు సంసిద్ధపడిన
యంతఁ గుడిచెవిలో ననాహతముగానె
యొకయనిర్వాచ్య మగుశబ్ద ముప్పతిల్లు.

ఆహతము లైనశంఖభేర్యాదులందు
గలుగుశబ్దము విన మనం బెలమిఁగొనును
మధుమధురమఖండిత మయి మనెడియీయ
నాహతముమాట వేఱె యే మనఁగవలెను ?

స్వాంత మీవిషయాభిలాషను ద్యజించి
యమితనిశ్చలభావంబు నందుకొలఁది
వేణునాదముతీరున వీనుదోయి
కతిమధురదీర్ఘనాద మొం డవతరించు.

పరమనాదానుసంధానపరత నుంట
బీజశుద్ధి, విశ్వాసము, విశ్రమమ్ము,
కార్యసుస్థిరత్వము, సిద్ధి గలమనస్సు
న కిది యుపలక్షణ మ్మంద్రు జ్ఞానపరులు.

ఆనాదాభ్యంతరమునఁ
బూనిక నేజ్యోతి పొంది పొసఁగుచు నుండున్
దాన న్మనంబు లీనం
బైనన్ సంసారబంధ మది యంత మగున్.

చిరము నాదానుసంధానపరత నున్నఁ
జిత్తలయముచే నానందసిద్ధి గలుగు
నన్యలయము లనంతము లమరెనేని
శ్రేష్ఠ మీచిత్తలయ మని చెప్పుచుంద్రు.

-❋-

ప్ర బో ధ ము

—/—

బెల్లమునందు నున్నరుచి పెల్లుగ నుండుఁ దదంశమందు, భే
దిల్లవు రెండు;ఁగప్పురము దివ్యసుగంధము వేఱు గానటుల్
సల్లలితాత్మతత్త్వమయసారమనస్సున కీజగత్తు తా
నెల్లఁ బరాత్మరూపముగనే కనుపట్టును భేద మేదుటన్.

నిదురకు న్ముందు; మెలకువపిదప; నరుఁడు
పొందుభావానుభవమె యెప్పుడును లోన
స్థిరముగా నిల్పుకొన్నచోఁ బరమ మైన
అద్వయానందసిద్ధి తా నందు నపుడె.

అత్యంతగంభీర మై, అంతు లేని చి
దానందసాగ రాభ్యంతరమున
కర్మసమీర సంఘర్షణమ్ముక తాన
జీవతరంగాలి చెలఁగుచుండు
చైతన్యరూపభాస్కరుఁ డుదయంబంది
దివ్యకాంతులఁ బ్రదీప్తిని వహింప
జీవనానాత్వ సంభావనా మృగతృష్ణ
కల్లయై తోఁచు నిక్కముగ నపుడు.

దేనియందు నీజగములు లేనివయ్యు
నున్నరీతిగ భాసించుచుండు, దేని
రూఢి దర్శింప నీయసద్రూప మణఁగు
నట్టియానందసాగర మందు మయ్య.

సారె కిటు పరమానందసాగరమున
అంతటను బూర్ణుఁడై మున్క లాడెనేని
అతఁడు హ్రదమున మున్గియున్నట్టి నీర
పూర్ణకలశ మట్టులు జ్ఞానపూర్ణుఁ డగును.

పూర్ణంబుకంటెను బూర్ణతరం బౌచుఁ
బరముకంటెను బరతరము నగుచు
ఆద్యంతరహిత మై యలలు లేనట్టి వి
జ్ఞానసుధార్ణవసదృశ మగుచు

కోటిప్రభాకరపాటలద్యుతి దిఙ్మ
భంబుల వెలిఁగించి ప్రబలునట్టి
హరిరూప మైనస్వాత్మానందరసమందు
మగ్నమానసుల కీమహితలమున
నేను లేను జగత్తులు నీవు లేవు
స్వపరభేద మభంబు శుభంబు లేదు
పరమకృత్స్న మీబ్రహ్మాండభాండసమితి
అద్వితీయంబుగాఁ దోఁచు టబ్బురంబె?

-✻-

ద్వి ధా భ క్తి

—/—

మనసున సాత్త్వికోదయము మానక గల్గఁ దటిత్తుపోలికన్ ఘనతరబోధముం గలుగుఁగాదె, యదంతట సుస్థిరత్వముం గనఁగ మనస్సు నిర్మలతఁ గాంచును, చౌటను బట్టపోల్కి కృష్ణుని పదభక్తి లేక పరిశుద్ధము నందదు చిత్త మెమ్మెయిన్

అద్దముజిడ్డు భస్మమున నల్లనఁ బోఁదుడువన్ విశుద్ధమై ముద్దుమొగంబు దానఁ గనఁబోలినరీతి మనంబు కూడ సంశుద్ధముగాఁగ నందుఁ బరిశుద్ధపుజ్ఞానము పుట్టుఁగావునన్ నిద్దపుటద్దమట్టు లతినిర్మలమై మన సొప్పఁగావలెన్.

అమలహరిభక్తిచే జ్ఞానులైనవారు
హరికి మూర్త మమూర్తము ననెడిరెండు
ఉపనిషత్ప్రసిద్ధాకృతు లున్న వనుచు
దెలిసికొని వచించిరి తేటతెల్లముగను.

అట్టిరూపద్వయంబుఁ దా మంది కొలువ
రెండుభక్తిమార్గముల నిర్మించినారు
కర్మబద్ధుఁ డారెండుమార్గములఁబట్టి
కష్టముగనో హాయిగనో మోక్షంబుఁ గాంచు.

అమలహరిభక్తి స్థూలసూక్ష్మము లటంచు
నుభయథా లోకమందున నొప్పుచుండు
మొదట స్థూలమై దానిసన్నిధివశాన
పిదప సూక్ష్మమై దినదినవృద్ధిఁ గాంచు.

స్వాశ్రమంబునకు నేర్పడినధర్మము సేఁత
అచ్యుతప్రతిమార్చనాదరమ్ము
వివిధోపచారముల్ వేడుకం జేయుచు
హరిదాసవరులతో నర్తియుంట
సత్యవాదనము కృష్ణస్వామికథలనే
వినుటకు సతతంబు వేడ్కవడుట
పరధనయువతులపై పరాఙ్ముఖతయు
పరులపై నిందలు పల్కకుంట

గ్రామ్యకథలను వినకుంట రక్తిఁ బుణ్య
తీర్థముల భక్తి సేవింపఁ దివురుచుంట
కృష్ణుకథలను వినకుంటిమేని జీవి
తమ్ము వృథ యనుచింత సంతతము వలయు.

ఇటులు సంతతభక్తితో నెసఁగెనేని
కృష్ణునియనుగ్రహమ్ము మిక్కిలిగ గలిగి
పుట్టు నాసూక్ష్మభక్తి, తన్మూలకముగ
పొదలుచుండు హర్యావేశ మది నిజంబు.

స్మృతిపురాణములెల్లఁ జెప్పిన శ్రీహరి
మూర్తినే మనసునఁ బూజసేత
జనశూన్య మగుప్రదేశమున నుండుట కిచ్ఛ
సర్వభూతములపై జాలిపడుట
అవని సమస్తజంతువులందు కృష్ణుఁడే
కలఁ డనుసన్మతి కలిగియుంట
ప్రాణుల కెట్టిద్రోహము సేయకుండుట
దొరకినదాన సంతుష్టి గొనుట

దారపుత్త్రాదిపై మమత్వంబు విడిచి
క్రోధమును నహంకారమున్ గూలఁద్రోసి
పరులనిందాస్తుతుల సమత్వంబుఁ గనుచు
నున్నచో సూక్ష్మభక్తి సంపన్న మగును.

మృదుభాషణమ్మె నంతే నిర్మలత్వము
ద్వంద్వదుఃఖసహిష్ణుతయును గల్గి
ఆహారనిద్రావిహారమ్ములను నాస్థ
ఆపదలందభయత్వవృత్తి
సంగరాహిత్యంబు సర్వదా శ్రీకృష్ణ
సంస్మరణధ్యానసరణి నుంట
హరిగీతి వేణునాదాదులు వినిపింప
సాత్త్వికోద్రేకహృష్టతలు మించి

అపరిమితమైనయానంద మందుచుంట
అట్టులె పరాత్మసుఖ మంది యామనస్సు
పూనినిశ్చలంబైనచో మానవుండు
తాను బొందు మహోన్మత్తదంతిదశను.

సకలజీవులందుఁ జైతన్యరూపుఁడై
దైవ ముండె ననెడి తలఁపు, దైవ
మందు భూతరాశి యణఁగియున్న దటన్న
దశను బొందును హరిదాసవరుఁడు.

-❋-

ప్ర బో ధ సు ధ

ధ్యా న వి ధి

— 1 —

యమునానదీతీరమం దున్నరమ్యబృం
దావనకాననస్థలమునందు
కల్పవృక్షమునీడ కాలిపై కాలూని
యంబుదశ్యాముఁడై యమలమైన
తనదు తేజస్సుచేతను లోకములనెల్ల
వెలిగించుచున్న యావిశ్వమయుని
చందనకర్పూరచర్చితసర్వాంగు
నాకర్ణపూర్ణదీర్ఘాయతాక్షు

రత్నకుండలమండితశ్రవణయుగలు
మందసుస్మితోద్యన్ముఖసుందరాంగు
కౌస్తుభోదారమణిహారు కనకచేలు
నీమనోదర్పణమునందు నిలుపుకొమ్ము.

వలయాంగుళీయభూషణ
ముల నుజ్జ్వలముగ నొనర్చు మోహనమూర్తిన్
గలవిలుళితవనమాలా
కలితున్ గలిపాపహంతఁ గనవే మనసా

గుంజారవాళికలితుని
గుంజాపుంజయుతశీర్షు గోపకిశోరున్
కుంజాంతరసంచారున్
రంజితగోపాలకున్ చిరము నిల్పుమదిన్.

శిరమున శిఖిపింఛంబును
మురళి కరములందు ముగ్ధమోహనరూప
స్ఫురణము మణిమకుటము గల
పరమబ్రహ్మమును మదిని భావింపవలెన్.

శౌరిన్ మురారి హరి నసు
రారిన్ మధువైరి పాపహారిన్ పుణ్యా
చారిన్ సువిచారిన్ శ్రీం
గారిన్ గిరిధారి నెంచు కలిసంహారిన్.

మందారపుష్పవాసిత
మందానిలసేవితుని నమందానందున్
మందాకిన్యంచితపదు
బృందారకసేవితున్ హరిన్ నిలుపు మదిన్.

సురభీకృతదిగ్వలయుని
సురభిసహస్రావృతున్ విశుద్ధుఁ బరేశున్
సురభీతికుఁ బాయు మహా
సురభీముని స్వాంతమందుఁ జూడవె మనసా!

కందర్పకోటిసుందరు
నందారుజనావనప్రభవమందారున్
బృందావనప్రదీపున్
వందించు దయాసముద్రు వాంఛితఫలదున్.

అవనీభారాపనుదున్
సవనపతిన్ సవనకర్త సవనసుభోక్తన్
రవిపూర్ణచంద్రనేత్రున్
భువనాంచితగర్భభరుని పొడఁగను మనసా.

లీలానంతవిభావ్యుఁడు
ఫాలాక్షద్రుహిణశక్తిభద్రుండు జగ
జ్జాలావకృష్టనరపశు
జాలుఁడు మూలంబు వేదస్త్రాములకున్.

అతనిపాతకహారికథాళి విడిచి
చెవులు గ్రామ్యకథానికల్ చేరి వినున?
ముజ్జగంబులు మోహాన ముంచునతని
రూపమును వీడి కను లెటుఁ జూపు నిలుపు?

నందగోపాలబాలుఁ డానందమయుఁడు
శాశ్వతుం డగుకృష్ణుఁ డీసరణి వెలుఁగ
క్షణికపాపకర్మములకై కాంక్ష సేఁత
యింద్రియములదౌర్భాగ్యమే యెంచిచూడ.

"విమతజనాసహ్యావిభవసహస్రార
వరసుదర్శన చక్రకరమువాఁడు
రాజహంసాకార రాజితశ్రీపాంచ
జన్యసందీప్తహస్తమ్మువాఁడు

నిఖలవిరోధిశోణితలిప్తభీకర
కౌమోదకీయుక్తకరమువాఁడు
దుర్హృదరుంతుదదుర్ధరారోప
దుర్ధర్శనశార్ఙ్గహస్తమ్మువాఁడు

బృందారకానందకంద మహాకాంతి
కలితనందకయుక్తకరమువాఁడు
పుష్పంధయాక్రాంత పూతపరీమళ
వనమాలికాంచితతనువువాఁడు.

మధ్యాహ్నవిద్యోతమానఖద్యోత
మండలదీప్తిమన్మకుటమ్మువాఁడు
దీనపిపీలికాదిబ్రహ్మపర్యంత
దేహాలదేహియై తిరుగువాఁడు.

భ్రమర సమనీలకాకపక్షములవాఁడు
దళితపద్మవిశాలనేత్రములవాఁడు
మందమధురసుస్మితదంతకుందకుట్మ
లాననమువాని ధ్యానింపు హరిని మనస!

ఆసనశుద్ధి నుండి హృదయాసన మందలికృష్ణచిత్ర వి
న్యాసముఁ గాంచుచు న్మనసున య్యెడ చేర్చి జపించుచుండ న
భ్యాసము చాల కీమనసు పర్వులువెట్టును పుంతలంట వి
శ్వాసముతోడ దానిని వశంవదవృత్తిని లాగి ధ్యేయమం
దే ససి నిల్పుచున్ గడవనీయ కణంచుచునున్న నీకు న
భ్యాసబలంబు చేకురి నిబద్ధిగ ధ్యేయమె తోఁచు నెల్లెడన్.

కుడువ గింజుకొనెడి మెడత్రాటి లేగను
గదిసి లాగి కట్టుగుదియ సేర్చు
నటులు విషయములకు నట్టెట్టు పర్వెత్తు
నెద బిగింప సిద్ధి కుదురువడును.

దృఙ్మనస్సులు బలిమిఁ గేంద్రీకరింప
రక్తి సర్వేంద్రియప్రతర్పణము గలిగి
యాత్మ యపుడు ధ్యేయబ్రహ్మమందు గూడి
భ్రమరకీటమటుల్ పరబ్రహ్మ మగును"

-❋-

సప్తపది

కరుణాపారావారుఁడు, వరుణాలయగంభీరుఁడు
ఘననీరదసంకాశుఁడు, కలికృతకల్మషనాశుఁడు
గోవిందుని గోపాలుని, భావింపవె యోమనసా.

యమునాతీరవిహారుఁడు, ధృతకౌస్తుభమణిహారుఁడు
పీతాంబరపరిధానుఁడు, సురకల్యాణనిధానుఁడు
నారాయణు శ్రీహరి నీ, తీరుగ తలఁపవె మనసా.

మంజులగుంజాభూషుఁడు, మాయామానుష వేషుఁడు
రాధాధరమధురసికుఁడు, రజనీకరకులతిలకుఁడు (గోవిందుని.)

మురళీగానవినోదుఁడు, నిరతశ్రుతినుతపాదుఁడు
జలరుహదలనిభ నేత్రుఁడు, జగదారంభకసూత్రుఁడు (నారా)

గోవర్ధనగిరిరమణుఁడు, గోపీమానసహరణుఁడు
ముష్టికచాణూరహరుఁడు, మునిమానససంచారుఁడు (గోవిం)

సైగమగానవినోదుఁడు, నాదబ్రహ్మనివాసుఁడు
హాటకనిభపీతాంబరుఁ, డభయంకరమావరుఁడీ (నారాయ.)

కరకంకణమణిరశనా, పదమంజీరమనోహరు
నాసామౌక్తికసుందరు, నరరూపపరాత్పరేశు (గోవిందుని.)

తన్ను ముక్కలుగాఁ గొట్టుచున్న నేని
స్పర్శశిల టంకముల కిడు స్వర్ణభావ
మట్లె తనయెడ ద్వేషభావాక్తులైన
వారలకుఁ గృష్ణుఁ డిడును నిర్వాణసుఖము.

ప్రశ్న :—

ఆత్మనుండి జీవు లవతరించినరీతి
కృష్ణునుండి యవతరించిరోటు ?
ప్రియతరంబె యాత్మ విశ్వంబుకంటె న
న్నట్లు ప్రియతరుండె హరియుఁగూడ ?

సమా :—

సాహంకారత బ్రహ్మ యొక్కపుడు వత్సానీకముద్దొంగిలన్
మోహం బాతనికిన్ సృజింపఁగఁ బృథగ్భావమో రూపరే
ఖాహార్యంబులతోడ గుంపులుగ వత్సానీక మాత్మీయస
ద్దేహంబందుననుండి యాన్నృహరి సంధింపండె అబ్రమ్మగన్.

అగ్నినుండి స్ఫులింగంబు లవతరించు
నట్టు లని చెప్పియున్నశ్రుత్యర్థమునకుఁ
దారకాణగా దనపుణ్యతనువునుండి
జీవసందోహమును హరి సృష్టిచేసె.

యమునాతీరపు లేఁతపచ్చికల మేయన్ వత్సముల్ మందఁ ద
త్తమసంతానమటంచు గోపులును భ్రాంతస్వాంతతన్జేపుచున్
తమకంబొప్పఁగ క్షీరముల్ కుడుపుచున్ దత్తర్ణకాంగమ్ములన్
నెమరుల్వెట్టుచు నాకె వత్సలత నెంతేఁ దృప్తి తామందుచున్

గోపకులు తమ్ము వారించి కొట్టుచున్నఁ
గాని లేగలఁ గాంచి గోగణము లెల్లఁ
దమక మెచ్చి సంభ్రాంతచిత్తములతోడ
వడిగ వత్సాభిముఖములై పర్వెనంట.

గోపకులెల్లఁ బుత్రకులఁ గూడుచు ముద్దులు వెట్టికొంచు బల్
తీపిని గట్టిగాఁ గవుగిలించుచు మూర్ధము లానుకొంచు సం
దీపితపుత్రవత్సలత తెల్లముగా నతిలోకతృప్తినిన్
దేపకు దేపకున్ బరపి దివ్యదలౌకికలాభ మందరే?

ఇటులు లేగలు గోపకుల్ కృష్ణరూపు
లగుట గోగోపు లానంద మందినారు
ఆత్మమయుఁడు శ్రీకృష్ణుఁ, డత్యంతప్రియము
ఆత్మమే యని శ్రుతిశిఖ లాడెఁగాదె?

ప్రశ్న :—

లే దాత్మకు భోక్తృతయని
వాదమ్ముగదా! యటైనఁ బలుకై తవయ
త్నాదుల హరి పరకాంతలఁ
గా దనక రమింప నేమికారణమొ కదా,

సమా :—

సుందరమై నవీనమయి చూపుల కామెత లిచ్చు శౌరియా
నందద దేహ సౌష్ఠవము నాఁటఁ గనుంగొని గోపికాసతుల్
కందుచుఁ గృష్ణచిత్తలయి కామవికారము నొంది శ్రీహరిన్
బొందఁగ నెంచుచున్ విరహపూర్ణమనోవ్యథనంది రందఱున్

ఆడుచుఁ బాడుచున్ దినుచు నట్టిటు లేఁగుచు నింటిలోఁ బనుల్
పోడిమితో నొనర్చుచును భుక్తిని గొంచు వసించుచుండి యా
చేడియ లెల్లఁ గృష్ణగతచిత్తత నన్యమెఱుంగ కార్తలై
మాడుచు తెల్వి మాలి వనమాలిని గాంచుచునుండి రెల్లెడన్

అంతము లేనియట్టి విరహవ్యథఁ గుందుచు గోపికాసతుల్
కాంతుల శాఖులన్ నరులఁ గ్రమనికుంజములన్ మృగంబులన్
భ్రాంతతఁ గాంచి కృష్ణుఁ డనుభావన వానిని గౌఁగిలించి యా
యింతులు కొంతతృప్తిని వహింతురు కృష్ణసమర్పితాంగులై.

కృష్ణభూమిక యొకతె ధరించి మించి
పూతనాకృతి యొకతె పూన, దాని
పాలతిత్తులు పాలార్పఁ బట్టినటులు
వ్యాసభగవానుఁడే తాను వ్రాసిపెట్టె.

తమపతులందు గృష్ణునివిధం బది కన్నులఁగట్టి గోపికల్
తమిని రమించినా రనినఁ దప్పక యుండదటే కంతరాత్మయై
యమరినవాఁడు కృష్ణుఁడె, తమందును భర్తలయందునున్ సమ
స్తమున వసించి తాన తనతత్త్వమునందు రమించుటింతెగా.

మన్ను తినె నన్నక్రుధతో
మన్నింపక నోరు చూపు మన్న యశోదన్
మన్నించి నోట భువనము
లన్నిటిఁ జూపింపలేద! యామె చలింపన్.

ధరను లీలార్థతనువును దాల్చినాఁడు
సర్వలోకేశ్వరుఁ డనంతశక్తియుతుఁడు
క్రియల నిజమాయచే నలౌకికవిధానఁ
జేయవలెఁబో యనంగ విచిత్ర మున్న?

అనుగ్రహము

—/—

విసపుఁజనుఁబాలఁ దాను ద్రావింపఁదలఁచి
నందునింటికిఁ బూతన నాఁడు చేరెఁ
గాని, పూర్వపుణ్యవిశేషకలన దాని
తనువె కృష్ణార్పణంబయ్యె ధన్యగాదె!

బాల్యమున శకటుఁడు దనపైఁ బడంగ
నెక్కొని వధించి తనదుసాన్నిధ్య మొసఁగె
కంఠమున్ గౌఁగిలించినకరణిఁ బట్టి
యాతృణావర్తు శ్రీకృష్ణుఁ డణఁచివైచె.

కట్టఁబడి ఱోట, అల్లప్రాంగణమునందు
ప్రాకుచున్ యమలార్జునపాదపముల
నడుమఁబడి గుంజి యవ్వానిఁ బాఁడ వడంచి
బాలకృష్ణుఁడు సాయుజ్యపదము నిడఁడె?

దేవతలఁగొంగ యగుచు బాధించు కేశి
దానవుని మిత్తిసత్తికిఁ దగ నొసంగి
నీచబక కాక దనుజుల నీల్గఁజేసి
శ్రీహరి యశోకలోకముఁ జేర్చె మనిచెఁ.

తనమహాశక్తి గోగోపతతిని బట్టి
బాధపెట్టుమహాహిగాఁ బ్రబలియున్న
యయ్యఘాసురుగర్వము నణఁచివైచి
యనఘుఁ జేసి యాహరి మోక్షమును నొసంగె.

కారుచిచ్చునం బడుచు దగ్ధమగుచున్న
ముగ్ధులను గోపకుల నెల్లఁ బ్రోవఁదలఁచి
అయ్యరణ్యాహుతాశను నట్టె పీల్చి
వరదయాబ్ధి వారలను గాపాడ లేదె!

పిడుగుజడివానలకు నెంతొ బీతు గుడిచి
గోకులము వ్యాకులంబై వితాకువడఁగ
ఒంటరిగ కృష్ణుఁ డొకచేత నొడిసిపట్టి
వారి నోమఁడె యెత్తి గోవర్ధనంబు.

శిలలఁ గొట్టి వాసోలోభ కలితుఁ డగుచు
పర్వ లిడుచాకలిం దప్పపట్టఁబోక
వానియపరాధమున్ సైచి వాసుదేవుఁ
డిచ్చె వైకుంఠవాస మెంతేని దయను.

తుట్టపెదవులు దేహమందునను మూఁడు
వంకరల్ నత్రిమాటలు వరలుకుబ్జ
బుజ్వగ నొనర్చి స్రక్చందనోజ్వలగను
జేసి సంతోషపెట్టఁడే శ్రీధరుండు.

కువలయాపీడ మనుపేర భువిఁ జరించు
తుంగ భీకరమత్తమతంగజంబు
మిడుత దీపశిఖంబడి మడిసినటులు
హరిచరణఘాతమునఁ గూలి యరిగె దివికి.

యుద్ధమిషమున శ్రీకాంతు నొఱసికొని త
దంగసంగమంబున సర్వసంగ మేది
ముష్టికుండు చాణూరుఁడు మోక్షపథముఁ
బొంది వెలుగొందరే మహాద్భుతము గదుర.

యదుకులవతంసుపై పగ ముదిరి యుదరి
దేహకృత మైనతప్పు సంధించుకతన
కృష్ణగతహృదయుం డయి కేరుకంసు
ధ్వంసమొనరించె నాజనార్దనుఁడు కృపను.

యుద్ధతీర్థములో మునిగియుండి పిదప
హరిని దర్శించినట్టిపుణ్యంబుకతన
చక్రపాణి శ్రీకృష్ణుఁ డాచైద్యునకును
ఉపదవెట్టఁడె దయను సాయుజ్యసుఖము.

తాను దాల్చి మీనాద్యవతారములను
మహిని రక్కసులన్ బరిమార్చి, దయను
స్వస్వరూపము వారికి సంఘటించె
మోక్ష మిదువిషయమున నబ్బురము గలదె?

ఎవరు శ్రీకృష్ణుచేతిలో సీల్గినారొ
వరలలేదు వారికిఁ బునర్భవము భువిని
కానఁ దాన యంతర్యామియై నడపుచు
నన్నియవతారముల నామహాత్ము డెత్తె.

అమితబ్రహ్మాండభాండములను సృజియించి
ప్రత్యండ మొక్కొక్కబ్రహ్మ నిలిపి
విష్ణులన్ గోపగోపీజనంబుల నిల్పి
యజుని కెవ్వఁడు సూపె నబ్బురముగ
ఎవనిపాదోదకం బెలమితో శివుఁడును
శిరసావహించి శాసించి మించె
మూర్తిత్రయాతీతమున్ పృథగ్వ్యక్తియై
కృష్ణాఖ్య ధరియించి కేర నవఁడు

అతఁడు సచ్చిన్మయుం డవికృతుఁడు పరుఁడు
అతనినతసీసుగుచ్ఛాభమై వెలుంగు
నీలిమముగాఁగ భావన నిలిపి నిలిపి
తన్మయుఁడ నౌదు జనిబాధ దాటికొందు.

భవుడుబ్రహ్మాయు నేమహామహుకృపాపాత్రత్వముం గాంచిరో
యవని న్నెవ్వనిపాదముల్ కడుగునీ రాజాహ్నవీతోయమో
యెవఁ డీదత్తుఁడో సర్వలోకవిభుతన్ హేలన్విభుండయ్యె నా
ధవుఁ డేమాఁకుని దానవహా, యదుపతిత్వఖ్యాతిఁ జెన్నొందఁగన్.

అకటా! కృష్ణమ! మోహసంభవుని న న్నామాయ కర్పించి పెం
పకముం జేయ; దటస్థభావము వహింపంబూని తిందాఁక నా
మొకమైనం గనకుంటి వెంతటిదయాపూర్ణాబ్ధివే తల్లి! నీ
విఁక నిల్లే కన, మూలశాంతివిధి లేనేలేద యేనాఁటికిన్.

జనకుఁడ నీవు నా, కఖిలసంగవిహీనతటస్థవృత్తులన్
గుణరహితత్వతన్ మసలుకొందువు, నాబ్రతు కెట్లు తెల్లవా
రునొ? యిఁకమీఁద నాపయి నిరూఢిగ స్నేహముసూపవేని యే
మనఁగల? మావిశాలజఠరాంతరమందున నేని నిల్వుమా.

ఎలమిని లోకరక్షకుఁడ వీవఁట, అయ్యయొ మాయసంసృతిన్
మలసెడికష్టనష్టములు మాకఁట? సూర్యుని రాకఁ బంకజం
బులు ముకులించుటా? అదియు పూర్వకృతంబుల
భోగమందువా
తెలిసెనమైన, ఱేఁడులు, నదృష్టము దైత్యులు నిన్ జయించుటే

అమలనిత్యానంద మనుసుధాబ్ధిని బుట్టి
మిన్నందుసన్నీలమేఘ మిపుడు
తనవచోధారల ననయంబుఁ దనియింపఁ
బూని యద్భుతమహాజ్ఞానసుధను

సజ్జనోత్కంఠ యన్ ఝంఝూప్రభంజనా
క్షిప్తమై యిపుడు వర్షించుచుండె
అయి! మనశ్చాతకమా దానిఁ గ్రోలఁగాఁ
గాంక్ష సేయ వదేమికర్మమమ్మ?

అక్కటకట! మాయాక్రాంత వైతివేమొ?
మొద్దునిద్దురలో మునిగిపోయితేమొ?
ఇచటికిం దగ్గరే భార మేమి లేదు
తత్సుధను గ్రోలి యాత్మతాదాత్మ్య మందు.

మానసమా? చలత్వమును మాని తరాజున నొక్కదిక్కునన్
శ్రీనిధియైనమాధవుని జేర్పుమ, యావిషయాలి నొక్కెడన్
పూనిక నుంచుమప్డుహితముద్దగు శాంతియుహాయియెందునీ
కానునొ యుక్తిచే ననుభవాదుల, నెంచి భజించు దానినే.

కొందఱు కామ్యముల్ సలిపి కొద్దిసుఖంబునె కోరుచుందురే!
కొందఱు యజ్ఞయోగములఁ గోరుదు రల్పసువర్గమోక్షముల్
అందముగా యదూద్వహుపదాంబుజభక్తినె కోరుచుందు మా
కెందులకయ్య లోకము, మహీపతులాత్రిదివాపవర్గముల్?

జడ మయస్కాంతమే తనసన్నిధాన
వర్తియగు నినుమును లాగివైచుచుండ
ఆశ్రయించినజనుల నత్యాదరమున
ఆదరింపకయున్నె నారాయణుండు?

"దుఃఖమయ మస్థిరం బయి తోఁచుతుచ్ఛ
పదవికై నీచులపదాలు పట్టుచుండ్రు
చిరతరానందమయము సుస్థిరము నైన
పద మొసంగుశౌరిపదమ్ము పట్టరేలో?"

వయసుచే జాతిరూపసంపదలచేత
ఉత్తముం డధముండు శ్లాఘ్యుం డటన్న
భేదభావ మెఱుంగఁ డావేదమయుఁడు
ససిగ భక్తులఁ బాలించుసమయమందు.

అంతరాత్మయై లోనిభావాదులను గ్ర
హించునామహామేఘ మెంతేనిదయను
వర్షణముసేయుఁగాని సర్వత్ర, యిద్ది
ఖదిర మిదిచంపకం బనుకాంక్ష గానునె?

ఆనృహరి సర్వసముఁ డయినప్పటికిని
భక్తులే యాతనిదయార్ద్రపరమదృష్టి
నంది దివ్యతరానంద మందుచునికి
తెల్లమగుట తద్భక్తి సంధిల్లవలదె?

అమ్మ పాలీయ లేదు దిక్కైన లేదు
కేవలస్నేహదృష్టిమాత్రావలంబ
నమ్మకలనఁ దాఁ బేటిసంతాన మెలమి
బ్రతుక, శ్రీహరికృప నేమిభ్రాంతి మనకు?

ఆకసము శూన్యమయ్యుఁ దన్నాశ్రయించి
త్రికరణవిశుద్ధి నమ్మ చాతకచకోర
ముల పిపాసలఁ దీర్పదే; జలదచంద్ర
రూపములతోడ? హరి నమ్మ లోప మున్నె?

అట్టులె భజించుజీవుల నాదరించి
అతఁడు వాఙ్మనోదృష్టుల కందకుండి
కేవలం బకారణమహాకృపను జూపి
తన్వు, నానందసత్యామృతం బొసంగి.

"అతనిసృష్టిలోని యల్పవస్తువుల క
నంత శక్తు లిట్టు లమరుచుండ
సృష్టికర్త కెంతచేవ యెసంగునో
తలఁచి మనసు నచట నిలుపవయ్య"

-✱-

సూర్యనారాయణశాస్త్రి రచనలు

1.	జీమూతవాహనుడు (పద్యకావ్యము)		రు 2-00
2.	జడభరతుడు	,,	రు 2-00
3.	అహల్య	,,	రు 3-00
4.	భక్తశబరి	,,	రు 2-00
5.	నీలకంఠవిజయము	చంపువు	రు 3-00
6.	శివలీలార్ణవము	ప్రబంధము	రు 5-00
7.	ప్రబోధసుధ	ఖండిక	రు 1-00
8.	శంకరవాణి	(లఘుకావ్యసంపుటి)	పై 0-50

ప్రతులకు :

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి,

రవీంద్రనగర్, కాకినాడ-2.

దుర్గా ప్రెస్ (ఫోన్ : 920) కాకినాడ-1.